www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in
7207282727 | 72707292727



గణేశ్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

4

గురువారం, 10-09-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :126 Issue : 126 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in


# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్



- కేటీఆర్, హరీష్ రావు సహా 22 మందిపై వేటు
- సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం
- సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్

**హైదారాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా వారు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న ఈ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి,

మిగతా 2వ పేజీలో..





## కాళోజీ సేవలను స్మరించుకోవాలి



- కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా సీఎం శుభాకాంక్షలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :** తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు

మిగతా 2వ పేజీలో..

## ఇది బీఆర్ఎస్‌పై సస్పెన్షన్ కాదు..

- ప్రజా సమస్యలపై కాంగ్రెస్ విధించిన సస్పెన్షన్
- నియంతృత్వంతో ప్రజాస్వామ్యాన్ని అణచలేరు
- బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :** అసెంబ్లీ సమావేశాలు అంటే ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడం కాదు.. ప్రజల సమస్యలపై చర్చ జరగాలి.. వాటికి పరిష్కారం చూపాలి అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు అన్నారు. మూడు రోజులుగా అసెంబ్లీ సమావేశాలను ప్రజలు చూస్తున్నారు.. ప్రజలు ఎదుర్కొంటున్న ఒక్క సమస్యపైనైనా చర్చ జరిగిందా.. ఒక్క ప్రభుత్వ విధానంపైనైనా సమాధానం చెప్పారా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాన్ని వేధించడం, గొంతు నొక్కడం, బయటకు పంపించడం తప్ప ప్రజల సమస్యలపై ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. అసెంబ్లీలో

మిగతా 2వ పేజీలో..

## సభాపతిని, దళితులను అవమానిస్తే సహించం

- కుట్రదారులపై అట్రాసిటీ కేసులతో కఠిన చర్యలు
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక



2

## స్పీకర్‌ను శాసించే హక్కు ఎవరికీ లేదు


- మీ బెదిరింపులకు ఎవరూ భయపడరు
- శుద్ధి కార్యక్రమాల ద్వారా దళితులను అవమానించారు
- ప్రతిపక్షంపై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్



2

## స్టైఫండ్ డబుల్

- ఆయుష్ విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్
- స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ
- మంత్రి దామోదర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్



2

## అసెంబ్లీ సాక్షిగా డ్రామాలాడుతున్నారు

- వైఫల్యాలు, అవినీతి కప్పిపుచ్చుకునేందుకే ఇరు పార్టీల నాటకాలు
- ఎమర్జెన్సీ చీకటి రోజులను తలపిస్తున్న రేవంత్ రెడ్డి పాలన
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై డాక్టర్ లక్ష్మణ్ ఫైర్



3

## ఇన్సూరెన్స్ పేరుతో కోట్లలో బురిడీ

- ఆఫర్ల పేరిట ఆగడాలు
- రాత్రికి రాత్రే బోర్డులు తిప్పేయడం
- ఐఆర్ డీఏఐ లైసెన్స్ లేకుండా 20 మందితో నెట్ వర్క్
- బాధితుల్లో రైతులు, కూలీలు, పోలీసులు కూడా
- విచారణ జరపాలని బాధితుల డిమాండ్




3



## కాళోజీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి

- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి
- రవీంద్రభారతిలో కాళోజీ జయంతి ఉత్సవాలు
- వి.ఆర్.విద్యార్థికి కాళోజీ సాహిత్య పురస్కారం ప్రదానం

3

## పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు

- కాంగ్రెస్ సర్కార్‌పై, హామీలపై ఫిర్యాదుల వెల్లువ
- వెయ్యి రోజులు గడిచినా హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై వైఫల్యం
- దాడిపై గవర్నర్‌కు ఆధారాలు చూపాం: కేటీఆర్



3

## బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక వైఖరి

- ఇద్దరు మండలి సభ్యులు స్పీకర్‌ను అవమానించారు
- బీఆర్ఎస్ దుశ్చర్యలపై చర్యలు తీసుకోవాలి
- గవర్నర్‌కు కాంగ్రెస్ సభ్యుల వినతిపత్రం

2



## కాళోజీ సేవలను స్మరించుకోవాలి

**మొదటిపేజీ తరువాయి**

సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి సేవలను మనమంతా స్మరించుకోవాలన్నారు. కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పుష్పాంజలి ఘటించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల గొంతుకగా నిలిచిన కాళోజీ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రజా ప్రభుత్వం సారథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ భాషకు కాళోజీ చేసిన సేవలు శ్లాఘనీయమని, ఆయన స్ఫూర్తితో తెలంగాణ భాష, సాహిత్యానికి మరింత ప్రోత్సాహం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

## గడీల పాలనపై గర్జించిన ధీర వనిత ఐలమ్మ

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

గడీల పాలనకు, దొరల అహంకారానికి వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అణచివేత, దమనకాండకు వ్యతిరేకంగా ఆ మహనీయురాలు ఎగరేసిన ధిక్కార పతాకం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి (10వ తేదీ) సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని సీఎం గుర్తు చేశారు. సమ్మక్కసారక్క, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని తెలిపారు. వారి ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

## ఇది బీఆర్ఎస్‌పై సస్పెన్షన్ కాదు..

**మొదటిపేజీ తరువాయి**



ప్రజా సమస్యలు చర్చకు రాకుండా తమను బలవంతంగా బయటకు పంపించడం అప్రజాస్వామికం అని ఆయన విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు వస్తున్నాయని తెలిసి తమ సమస్యపై అసెంబ్లీలో మాట్లాడండి అంటూ ఎన్నో వర్గాల ప్రజలు తమకు వినతిపత్రాలు ఇచ్చారు.. వారు ఎంతో ఆశగా ఫోన్లు చేస్తున్నారు.. మెసేజులు పెడుతున్నారు.. మా గొంతును అసెంబ్లీలో వినిపించండి అని ప్రజలు అడుగుతుంటే తాము బాధపడటం తప్ప ఏం చేయాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ఎప్పుడు పూర్తి చేస్తారని ఆర్టీసీ ఉద్యోగులు, నిషేధిత జాబితా నుంచి తమ భూములను ఎప్పుడు తొలగిస్తారని భూయజమానులు అడుగుతున్నారు.. తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న జీవో 97ను ఎప్పుడు రద్దు చేస్తారని పాలిటెక్నిక్ విద్యార్థులు అడుగుతున్నారు.. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.. డీఏ, పీఆర్సీ కోసం ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.. కారుణ్య నియామకాల కోసం సింగరేణి ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.. పింఛన్ల పెంపు కోసం అవ్వాతాతలు ఎదురుచూస్తున్నారు.. ఇవన్నీ అసెంబ్లీలో చర్చకు వస్తాయనే భయంతోనే ప్రభుత్వం ప్రతిపక్షాన్ని సభ నుంచి బయటకు పంపింది అని ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిలదీసే బీఆరఎస్ గొంతును సస్పెన్షన్ పేరుతో నొక్కాలని చూస్తున్నారన్నారు. కానీ రేవంత్ రెడ్డీ.. గుర్తుంచుకోండి.. ఇది ప్రతిపక్షంపై విధించిన సస్పెన్షన్ కాదు.. ఇది ప్రజా సమస్యలపై, ప్రజల గొంతుపై విధించిన సస్పెన్షన్ అని అన్నారు. మైకులు కట్ చేసో.. సస్పెన్షన్ విధించో అసెంబ్లీలో మా గొంతును అణచి వేయవచ్చు కానీ ప్రజాక్షేత్రంలో చేయలేరు అని వ్యాఖ్యానించారు. ఎంత అణచివేస్తే అంత బలంగా ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని, నియంతృత్వంతో ప్రజాస్వామ్యాన్ని ఎక్కువ కాలం అణచివేయలేరని అన్నారు. హిట్లర్ తనకు ఆదర్శమని చెప్పుకున్న రేవంత్ రెడ్డి.. హిట్లర్ తరహా నియంతృత్వ ధోరణులతో పాలన సాగిస్తే చరిత్ర ఇచ్చే తీర్పు నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. కేసీఆర్ పట్ల మీరు చేసిన అవమానాలు, వ్యక్తిగత దూషణలు, రాజకీయ కక్ష సాధింపులను సమాజం గమనిస్తోందని, ప్రజలే అంతిమ న్యాయమూర్తులు.. ప్రజలే మీకు తగిన గుణపాఠం చెబుతారు అని అన్నారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పే వరకు బీఆర్ఎస్ వెనక్కి తగ్గదు.. నియంతృత్వం ఎంత పెరిగితే ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుందన్న విషయం గుర్తుంచుకోండి అని హరీశ్‌రావు హెచ్చరించారు.

## బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక వైఖరి

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు తాతా మధు, నవీన్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా శాసనసభ స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేశారని, మరణించిన ఆయన తల్లిని ఉద్దేశించి అనుచిత పదజాలం ఉపయోగించడం ద్వారా స్పీకర్‌ను తీవ్రంగా బాధించారని శాసనసభ, శాసనమండలిలోని కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇది మొత్తం దళిత సమాజాన్ని రాష్ట్రంతోపాటు దేశంలోని మహిళలందరినీ అవమానించినట్లయిందని గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో రాజ్యాంగ పరిరక్షకుడిగా అత్యున్నత హోదాలో ఉన్న గవర్నర్ జోక్యం చేసుకుని శాసనసభ ప్రాంగణంలోనూ, వెలుపలనూ దళితులు, మహిళల గౌరవం, భద్రత, ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. ఈనెల 8న జరిగిన ఘటనలు మన చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతాయన్నారు. శాసనసభ ప్రధాన ద్వారం వెలుపల మీడియా కెమెరాల సమక్షంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు తొలుత తన చొక్కాను విప్పారని, అనంతరం పలువురు ఇతరులు కూడా అదేవిధంగా చేసి పోలీసు సిబ్బందిపై చొక్కాలను విసిరారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా విధుల్లో ఉన్న మహిళా పోలీసు సిబ్బంది వైపు దూసుకెళ్లి వారిని తాకుతూ, అత్యంత అభ్యంతరకరంగా దగ్గరగా వెళ్లారన్నారు. ఎమ్మెల్యే కేటీఆర్ నేతృత్వంలో పలువురు నాయకులు పోలీసు సిబ్బందిపై, మహిళా పోలీసు అధికారులపైనా భౌతికంగా దాడి చేశారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. దళిత సమాజానికి చెందిన సభ్యులు శాంతియుతంగా, చట్టబద్ధంగా ఎర్రవల్లి వైపు ర్యాలీగా వెళ్లి బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు క్షమాపణ చెప్పాలని కోరిన నేపథ్యంలో కూడా బీఆర్ఎస్ అత్యంత దారుణమైన చర్యలకు పాల్పడిందని వారు ఆరోపించారు. దళిత సోదరులు, సోదరీమణులు నడిచిన రహదారులను పసుపు నీరు, పాలు చల్లి శుద్ధి చేయడం ద్వారా నిషేధిత, చట్టవిరుద్ధమైన, అమానవీయమైన, అనైతికమైన అంటరాని తన ఆచరణను బీఆర్ఎస్ ప్రదర్శించిందని పేర్కొన్నారు. ఈ మధ్యయుగ, భూస్వామ్య మనస్తత్వాన్ని ప్రతిబింబించే చర్యలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సైతం బీఆర్ఎస్ నేతలు గర్వంగా ప్రచారం చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంటరానితనం సాధారణంగా ఉన్న చీకటి యుగంలోకి తెలంగాణతోపాటు భారత దేశాన్ని కూడా తిరిగి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. దళిత సమాజానికి వారి పదేళ్ల పాలనలో చేసిన ద్రోహాన్ని కాంగ్రెస్ నాయకులు వినతిపత్రంలో వివరించారు. దళిత ముఖ్యమంత్రిని చేస్తామన్న హామీని విస్మరించడం, దళిత సామాజిక వర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్యను అనూహ్యంగా పదవి నుంచి తొలగించడం, మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం, ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తామన్న హామీని విస్మరించడం, దళిత బంధు పథకాన్ని ఎన్నికల స్టంట్‌గా మార్చడం, అలాగే ఎస్సీ సబ్ ప్లాన్‌కు సంబంధించిన రూ.1,296 కోట్ల నిధులను ఖర్చు చేయకుండా మిగిల్చడం వంటి అంశాలను వారు ప్రస్తావించారు. ఈ ఘటనలకు ప్రత్యక్షంగా పాల్పడిన వారిపైనే కాక బీఆర్ఎస్ అగ్ర నాయకత్వంలో ఉన్న అసలు కుట్రదారులపై కూడా అత్యంత కఠినమైన శిక్షలు విధించేలా చర్యలు తీసుకోవాలని వారు గవర్నర్‌ను కోరారు.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**మొదటిపేజీ తరువాయి**

సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే వి వాంట్ జస్టిస్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించగా స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితోపాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేసి అవమానించడమే కాక న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేదలకు న్యాయం జరగాలన్నారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి రాష్ట్రం సిద్ధంగా లేదని భట్టి ఘాటుగా అన్నారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై కేసు నమోదు**

మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారన్న ఘటనపై కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అసెంబ్లీ గేట్ నంబర్ 3 వద్ద సోమవారం జరిగిన ఘటనపై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో 74, 75(1), 79, 121(1), 130, 132, 296, 351(2), 352తీ/• 3(5) సెక్షన్ల కింద బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారని ఫిర్యాదులో బాధిత పోలీసు సిబ్బంది వెల్లడించారు. మహిళా పోలీసులనుద్దేశించి బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. మహిళా పోలీసులు అని చూడకుండా తమ ఎదుట టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వర్తించకుండా అడ్డుకుని బెదిరించినట్లు వివరించారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ, వీడియోలు, ఫొటోలు, వైద్య రికార్డులు పరిశీలించాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రవర్తన దురుసుగా ఉందని తెలిపారు. మహిళా పోలీసులను నెట్టడంతో ఇబ్బంది కలిగించారని ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో తమకు తీవ్ర మానసిక వేదన, అవమానం కలిగిందని తెలిపారు. ఘటన అనంతరం మహిళా పోలీసులకు హాస్పిటల్‌లో వైద్య చికిత్సలు చేసినట్లు వివరించారు.

# సభాపతిని, దళితులను అవమానిస్తే సహించం

- అంటరానితనం, దొర అహంకారం పేరుకుపోయాయి
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు
- కుట్రదారులపై అట్రాసిటీ కేసులతో కఠిన చర్యలు
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:**

శాసనసభలో సభాపతి స్థానాన్ని, దళిత వర్గాలను అవమానించేలా బీఆర్ ఎస్ నాయకులు వ్యవహరించడం అత్యంత హేయమైన చర్య అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. శాసనసభలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన ప్రతిపక్ష నేత కేసీఆర్, బీఆరఎస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా రంగంలో అక్రమాలు, ధరణి సమస్యలు, 22ఎ వివాదంపై సభలో చర్చ జరగాల్సి ఉందని సీఎం పేర్కొన్నారు. అయితే పదేళ్ల పాలనలో జరిగిన దురాగతాలు, చేసిన అప్పుల వివరాలు ప్రజలకు తెలుస్తాయనే భయంతోనే ఫామ్‌హౌస్‌లో కుట్రలు పన్ని తమ సభ్యులతో సభను అడ్డుకున్నారని ఆరోపించారు. సభాపతి స్థానాన్ని, వారి తల్లిని కూడా అవమానించేలా వ్యవహరించడం ఉన్మాద చర్య అని సీఎం అభివర్ణించారు.

**దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడమా?**

ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో రిజర్వేషన్లను కల్పించింది కాంగ్రెస్ పార్టీ.. ఇది కాంగ్రెస్ విధానం అని తెలిపారు. కర్ణాటకలో ఒక చిన్న గ్రామంలో పుట్టి రజాకార్ల దాడులలో తండ్రిని కోల్పోయి కార్మిక నాయకుడిగా రాణించి జాతీయ స్థాయికి ఎదిగిన నేత మల్లికార్జున ఖర్గే.. 60 ఏళ్లుగా ఆయన ప్రజల కోసం పనిచేస్తున్నారు.. ఉత్తరాఖండ్ లో ఒక మైదానంలో జరిగిన సభలో ఆయన పాల్గొంటే ఆగస్టు 10న బీజేపీ అనుబంధ సంస్థ ఆ మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడం హేయమైన చర్య.. దీన్ని ఈ సభ ముక్తకంఠంతో ఖండిస్తోంది.. పార్లమెంట్ సభ్యులు రాష్ట్రపతిని కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారని సీఎం తెలిపారు. ఇదిలా ఉండగానే రాష్ట్రంలో మరో దురదృష్టకర సంఘటన జరిగింది.. ఉన్మాదానికి లోనై ఉసిగొల్పబడిన కొంతమంది ముష్కరులు అధికారులపై దాడులు చేయడమే కాక సభాపతి కుర్చీని అవమానించేలా వ్యవహరించారు.. వ్యక్తినే కాక ఆయన తల్లిని కూడా అవమానించారు మహిళలను శక్తిగా కొలిచే సమాజం మనది.. భారత దేశాన్ని భారత మాత అని, తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావిస్తున్నాం.. సభాపతిగా ఉన్న మీ మనసుకు గాయం చేయాలని ఉన్మాదంతో మాట్లాడారు.. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభాపతికి క్షమాపణ చెప్పి వారి సభ్యులతో క్షమాపణ చెప్పించి సభ సజావుగా జరిగేలా చూస్తారని అంతా భావించారు.. కానీ అలా జరగకపోగా మరింత ఉన్మాదంతో వ్యవహరించారు.. అందుకే ఏ ఫామ్ హౌస్‌లో కుట్ర జరిగిందో ఆ ఫామ్ హౌస్ ముందు దండోరా వేయాలని ప్రజాస్వామ్యవాదులు నిరసనకు దిగారు.. వాళ్లలా ఉన్మాదానికి తెగబడలేదు.. కేవలం డప్పు దరువులతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపారు.. ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లిన దళిత సోదరులను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా అవమానించారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించడం దొర అహంకారానికి, అంటరానితనానికి నిదర్శనం అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా బాధలో ఉన్నవారి సమస్యను పరిష్కరించే బాధ్యత వారిపై ఉంది.. ఆ ప్రతినిధులను లోపలికి పిలిచి మాట్లాడి జరిగిన సంఘటనపై కేసీఆర్ బాధ్యతతో వ్యవహరించాల్సి ఉండే కానీ అలా వ్యవహరించకుండా ఉన్మాదంతో వ్యవహరించారు.. దళితులు తిరిగిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించి తీవ్రంగా అవమానించారు.. అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా ప్రశ్నించారు. శుద్ధి చేయాల్సింది దళితులు నడిచిన నేలను కాదు.. మీ మనసుల్లో పేరుకుపోయిన అహంకారాన్ని, మనువాద ఆలోచనలను అని హితవు పలికారు. మల్లికార్జున ఖర్గే, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లకు జరిగిన అవమానం మొత్తం తెలంగాణ సమాజానికి జరిగినట్లేనన్నారు. తీవ్రవాదులకు, ఉన్మాదంతో సభాపతిని అవమానించిన వారికి పెద్ద తేడా లేదు అని వ్యాఖ్యానించారు.

**క్రిమినల్ కేసులు.. కఠిన శిక్షలు ఖాయం**

సభాపతిని అవమానించిన వారిని, కుట్రదారులను చట్టపరంగా తీవ్రంగా శిక్షిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 6న జరిగిన కుట్రతోపాటు తదనంతర ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులందరిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ప్రకటించారు. చట్టాల సందుల నుంచి బెయిల్ పొందవచ్చేమో కానీ, తెలంగాణ సమాజం మాత్రం బెయిల్ ఇవ్వదని స్పష్టం చేశారు.

# స్పీకర్‌ను శాసించే హక్కు ఎవరికీ లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

శాసనసభలో ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చ అని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు పాలనలో ఉండి, మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవజ్ఞులు, ఉన్నత విద్యనభ్యసించిన వారు సభలో స్పీకర్‌ను శాసించేలా ప్రవర్తించడం సభ్య సమాజానికి, ప్రజలకు తీవ్ర అవమానకరమని స్పష్టం చేశారు. తమ స్థానాల్లో కూర్చొని ప్రజా సమస్యలపై వాదనలు వినిపించాల్సిందిపోయి దాడి చేస్తాం, భయపెడతాం అనే ధోరణితో వ్యవహరించడం ఎంతమాత్రం సరికాదని బీఆర్ఎస్ సభ్యులకు హితవు పలికారు. శాసనసభ నడుస్తున్న తీరును దేశమంతా గమనిస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. వేళ్లు చూపే బెదిరింపులకు సభలో ఎవరూ భయపడేది లేదని, ప్రజాస్వామ్యంపై జరిగే దాడులను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల, సభ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సభాపతి స్థానాన్ని మరింత అవమానించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తాము సహించేది లేదని స్పష్టం చేస్తూ స్పీకర్ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా వెన్నెముకలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. సభా నియమాలను గౌరవిస్తూ సభ్యులందరూ తమ స్థానాల్లో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో చేసిన తప్పులకు పశ్చాత్తాపపడాల్సింది పోయి రహదారులపై పసుపు నీళ్లు చల్లి శుద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆ పార్టీ నాయకులు దళితులను అవమానించేలా వ్యవహరించారని మండిపడ్డారు. వందల ఏళ్ల సామాజిక సంస్కరణలతో పురోగమించిన నాగరిక తెలంగాణ సమాజాన్ని తిరిగి మధ్యయుగాల నాటి పరిస్థితికి తీసుకెళ్లడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకత్వ శుద్ధి కార్యక్రమంపై సభలో చర్చ జరగాల్సిందేనని స్పష్టం చేశారు

**సభాపతితో వాగ్వాదానికి దిగడం తగదు**

బీఆర్ఎస్ సభ్యులు పదేపదే వెల్‌లోకి వచ్చి సభాపతితో వాగ్వాదానికి దిగడం, ఆయన సూచనలను పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. సభను సజావుగా నిర్వహించేందుకు సభ్యులందరూ సహకరించాలన్నారు. ఈ సభ, ఈ రాష్ట్రం ఆత్మగౌరవంపై ఏర్పడింది.. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నాలు మంచిది కాదు.. రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. బీఆరఎస్ సభ్యులు న్యాయం కోసం డిమాండ్ చేయడంపై భట్టి విక్రమార్క తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సభాపతిని అవమానించేలా వ్యవహరించిన అనంతరం ఇంకా ఏం న్యాయం కావాలని ప్రశ్నించారు. ఏం జస్టిస్ కావాలి? జస్టిస్ కావాల్సింది ఈ రాష్ట్రంలోని దళిత, బహుజన వర్గాలకు. జస్టిస్ కావాల్సింది గిరిజనులకు. మీ చేతుల్లో అవమానాలకు గురైన ప్రజలందరికీ జస్టిస్ కావాలి అని విక్రమార్క అన్నారు. దళితుల పట్ల గతంలో జరిగిన అవమానకర ఘటనలను ప్రస్తావిస్తూ ఆయన బీఆరఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. దళితులు నిరసన తెలిపిన ఘటనను కూడా ప్రస్తావిస్తూ సామాజిక న్యాయం విషయంలో ఎవరు ఎవరిని ప్రశ్నించాలో ఆలోచించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సహనం పాటిస్తోందని, అయినప్పటికీ సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలిగించడం సరికాదని అన్నారు. దొరతనపు పోకడలను ప్రజలు ఇక భరించడానికి సిద్ధంగా లేరని భట్టి విక్రమార్క అన్నారు. సభా గౌరవాన్ని కాపాడటంతోపాటు సామాజిక న్యాయం, ప్రజల ఆత్మగౌరవాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**కేసీఆర్ నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలి : భట్టి**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు సేవలు అందించాలని తాము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనసభలో బుధవారం సభ్యుల ఆందోళనల నేపథ్యంలో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి సభ్యులు సంయమనం పాటించి తమ స్థానాల్లో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రభుత్వం గానీ, ఈ సభ్యులు గానీ, ఈ సభ గానీ కేసీఆర్ చావును కోరుకోవడం లేదు.. ఆయన నిండుగా నూరేళ్లు జీవించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఈ రాష్ట్రానికి ప్రతిపక్ష నాయకుడిగా సేవలు అందించాలని బలంగా కోరుకుంటున్నామని స్పష్టం చేశారు.

# స్టైఫండ్ డబుల్

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ రూ.34,385 నుంచి రూ.74,482కు పెరిగింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీవో కాపీని అందజేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ఇప్పుడు అల్లోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

**'ఆయుష్'కు మరింత ఆదరణ పెరగాలి : మంత్రి దామోదర్**

ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి వైద్యులుగా ఎదిగి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆయుష్ వైద్య విధానాలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా విద్యార్థులు, యువ వైద్యులు కృషి చేయాలని సూచించారు. విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాదని, వ్యక్తిగత అభివృద్ధితోపాటు సమాజంలో గుణాత్మక మార్పుకు పునాది అని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థను బలోపేతానికి ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆయుర్వేదం, హోమియో, యునాని విభాగాల్లో 138మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు. సిద్దిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేసి ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్లతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్ నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ఆయుష్ హాస్పిటల్స్, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి చెప్పారు. ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త చికిత్సా విధానాలు, ఔషధాలపై పరిశోధన చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. 'మీరు చదువుతో ఆగిపోవద్దు.. పరిశోధన వైపు కూడా అడుగులు వేయాలి.. మన సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ వైద్యులపై ఉంది' అని మంత్రి రాజనర్సింహ అన్నారు. పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆయుష్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

# పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:**

లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేం నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై, సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం.. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం అని చెప్పారు. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ వెయ్యి రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

**అవి ఏఐ ఫొటోలు .. వాటిని వాడిన వారిపై చట్టపరంగా చర్యలు**

కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన ఫొటోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా రూపొందించిన నకిలీ చిత్రాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తమ నేతలపై అసత్య ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సోషల్ మీడియా హ్యాండిల్స్ ఏఐ రూపొందించిన ఫేక్ ఫొటోలు, వీడియోలను ఉపయోగిస్తున్నాయని ఆరోపించారు. ఈ నకిలీ ఫొటోలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని, వాటిని రూపొందించిన, ప్రచారం చేసిన వ్యక్తులతోపాటు వాటిని ఉద్దేశపూర్వకంగా ప్రసారం చేసిన మీడియా సంస్థలపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. ఏఐ ద్వారా రూపొందించిన ఫేక్ ఫొటోలు, వీడియోలను నిజమైనవిగా ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను బీఆర్ఎస్ సహించబోదని స్పష్టం చేశారు. ఎలాంటి దాడులు జరగకపోయినా దాడులు జరిగినట్లుగా నకిలీ చిత్రాలు, కల్పిత కథనాలతో ప్రచారం చేయడం ద్వారా అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ అన్నారు. దొంగే దొంగ.. దొంగ అని అరిచినట్లు కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఇలాంటి దుష్ప్రచారంలో మీడియా సంస్థలు భాగస్వాములు కావొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ఫేక్ ఫొటోలు, వీడియోలను ధ్రువీకరణ లేకుండా ప్రచురించవద్దని మీడియా సంస్థలకు సూచించారు. బీఆర్ఎస్ నేతల ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో నకిలీ కంటెంట్‌ను రూపొందించినా, ప్రచారం చేసినా, ప్రసారం చేసినా సంబంధిత వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఇన్సూరెన్స్ పేరుతో కోట్లలో బురిడీ

**మహబూబ్ నగర్, సెంప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులమని, తక్కువ కాలంలోనే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికి అమాయక ప్రజల నుండి రూ.కోట్లలో వసూలు చేస్తూ నిలువునా ముంచుతున్న ఒక దందా వ్యవహారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. గత పదేళ్లుగా కంపెనీల పేర్లు, ఆఫీసుల చిరునామాలు మారుస్తూ ఒక ముఠా పద్ధతి ప్రకారం మోసాలకు పాల్పడుతున్నట్లు బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పదేళ్ల క్రితం 'ఐఐఎఫ్ఎల్ గోల్డ్ ఇన్సూరెన్స్ లైఫ్' పేరుతో జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఆఫీస్ ఏర్పాటు చేసి భారీగా డిపాజిట్లు, పాలసీలు కట్టించుకుని మోసం చేశారు. అప్పట్లో పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు, గొడవలు జరగడం సంచలనం సృష్టించింది. ఆ రగడ సర్దుమణగగానే అదే బృందం రూపం మార్చి 'ఎక్సైడ్ లైఫ్ ఇన్సూరెన్స్' పేరుతో మళ్లీ కార్యకలాపాలు మొదలుపెట్టింది. 5 సంవత్సరాలు చెల్లిస్తే చాలు.. 10 సంవత్సరాల పూర్తి బెనిఫిట్స్ వస్తాయి అని చదువురాని అమాయకులు, కూలీలు, రైతులను టార్గెట్ చేసి పాలసీలు కట్టించుకున్నారు. తీరా కొన్ని ఏళ్ల తర్వాత బాధితులు తమ పాలసీల స్థితి తెలుసుకోవడానికి పాత బస్టాండ్ సమీపంలోని 'కోటా కాంప్లెక్స్' ఆఫీస్‌కు వెళ్తే రాత్రికి రాత్రే ఆఫీసు ఖాళీ చేసి పారిపోయారు. ఫోన్ నంబర్లు కూడా మార్చేయడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆ తర్వాత విచారిస్తే తమ డబ్బులు హెచ్‌డీఎఫ్‌సీ కి వెళ్లాయని కొందరు చెబితే అక్కడికి వెళ్లి అడిగితే ఈ బాండ్లకు, మాకు ఎలాంటి సంబంధం లేదు అని ఆ సంస్థ చేతులెత్తేసింది. ఈ నిర్వాహకులు ఇప్పుడు మరో కొత్త రూపమెత్తినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సెంట్రల్ బ్యాంక్, ఫ్యూచర్ జెనరలి, అర్బన్ మనీ ఇన్సూరెన్స్ పేర్లు వాడుకుంటూ మహబూబ్ నగర్ లోని ఎర్రసత్యం చౌరస్తా సమీపంలోని ఒక భవనంలో ఎలాంటి బయటి బోర్డు లేకుండా ఆఫీస్ నడుపుతున్నారు. పెట్రోల్ బంకులు, రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లు, ప్రముఖ ఆలయాల వద్ద ఫ్రీ టోకెన్లు పంపిణీ చేసి, ఆ తర్వాత ఫోన్లు చేసి మీకు లక్కీ డ్రాలో గిఫ్ట్ తగిలింది, ఆఫీసుకు రండి అని పిలిపిస్తున్నారు. ఆఫీసుకు రాగానే మాటల గారడీతో నమ్మించి బలవంతంగా కొత్త పాలసీలు చేయిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. బాధితులు అందించిన సమాచారం ప్రకారం.. ఈ కార్యాలయంలో మేనేజర్ సుదర్శన్, ఆఫ్రీన్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రధాన సూత్రధారులుగా ఒక టీమ్‌గా ఏర్పడ్డారు. ఇన్సూరెన్స్ నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం అధికారిక ఏజెంట్ కోడ్ కానీ, అర్హత పత్రాలు కానీ లేని దాదాపు 20మంది యువతీ యువకులను వీరు నియమించుకున్నారు. వారికి నెలకు ₹10,000 జీతంగా ఇస్తూ వారి ద్వారా ఉచిత కూపన్ల వల విసిరి అమాయక ప్రజలను కార్యాలయానికి పిలిపించి పాలసీల పేరిట సొమ్ము వసూలు చేయిస్తున్నారని సమాచారం. ఈ మాయమాటలు నమ్మి మోసపోయిన వారిలో నవాబ్‌పేటకు చెందిన నిరుపేద టైలర్ మహమ్మద్ సుభాన్, శివ అనే వ్యక్తులతో పాటు స్వయంగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పలువురు పీసీలు కూడా ఉన్నట్లు బాధితులు తెలుపుతున్నారు. ఈ ఆరోపణలపై ప్రస్తుతం ఎర్ర సత్యం చౌరస్తాలోని 'అర్బన్ మనీ ప్రైవేట్ లిమిటెడ్' మహబూబ్ నగర్ బ్రాంచ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న సుదర్శన్ ను 'ప్రజాతంత్ర' వివరణ కోరగా పలు విషయాలు వెల్లడించారు. కూపన్ల క్యాంపెయిన్ నిజమే. ఇన్సూరెన్స్ వ్యాపారం పెంచుకునేందుకు అనేక రకాలుగా ప్రయత్నిస్తాం, అందులో భాగంగానే దేవాలయాలు, మార్కెట్ల వద్ద ఉచిత కూపన్ల పేరిట క్యాంపెయిన్ నిర్వహించాం అని ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కూపన్ల ద్వారా పిలిపించి పాలసీలు చేయడంపై ప్రశ్నించగా వ్యాపారం కోసం మా ప్రయత్నాలు మేము చేస్తాం అని పేర్కొన్నారు. అర్బన్ మనీ ఆఫీస్‌కు బయట కనీసం బోర్డు కూడా లేకుండా ఎందుకు నడుపుతున్నారని ప్రశ్నించగా పై అధికారుల నుంచి బోర్డు పెట్టమని ఆదేశాలు రాలేదు.. అందుకే పెట్టలేదు అని చెప్పారు. తమ వల్ల కొందరికి మంచి కూడా జరిగిందని అన్నారు. ఎలాంటి బోర్డులు లేకుండా, ఐఆర్‌డీఏఐ నిబంధనలను పక్కనబెట్టి అనాధికారిక వ్యక్తులతో ఇన్సూరెన్స్ వ్యాపారం నడుపుతున్న ఈ కార్యాలయంపై జిల్లా ఎస్పీ, విజిలెన్స్ అధికారులు, సైబర్ క్రైమ్ పోలీసులు తక్షణమే సుమోటోగా స్పందించి సమగ్ర విచారణ జరపాలని, బాధితుల కష్టార్జితానికి న్యాయం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ వీధి నాటకాలు

- **అసెంబ్లీలో ప్రజల పక్షాన నిలిచింది బీజేపీ మాత్రమే**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

శాసనసభ, శాసనమండలి వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు రోజులుగా ఆడుతున్న కపట నాటకాలను యావత్ సమాజం అసహ్యించుకుంటోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. చట్టసభల సమావేశాలు ప్రారంభమవుతున్నాయంటే తమ బతుకులు మారేలా ప్రజా సమస్యలపై చర్చ జరుగుతుందని వివిధ వర్గాల ప్రజానీకం ఆశగా ఎదురుచూస్తారన్నారు. వారి ఆశలను వమ్ము చేస్తూ అసెంబ్లీని ఈ రెండు పార్టీలు తమ వ్యక్తిగత దూషణలకు, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం బీజేపీ శాసనసభాపక్షానికి, పార్టీ ఎమ్మెల్యేలకు రాష్ట్రవ్యాప్తంగా నిత్యం వేలాదిగా ప్రజా సమస్యల అర్జీలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. లక్షలాదిమంది నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిన రూ.50వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, వివాదాస్పద 22ఎ భూముల జాబితా అంశం, ఉద్యోగుల సమస్యలైన పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలుతోపాటు రాష్ట్ర ఆర్థిక, సామాజిక సంక్షోభాలపై సభలో చర్చించాల్సిన అత్యవసర పరిస్థితి ఉందని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని అరాచకాల నుంచి విముక్తిని, మార్పును కోరుకుని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ సర్కార్ కూడా ప్రజాద్రోహ విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక తీవ్ర సమస్యలకు మూలకారణం గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలేనని అన్నారు. తమ పాపాలు, వైఫల్యాలు, అసమర్థత బయటపడకుండా ఉండేందుకు ఇరు పార్టీలు అసెంబ్లీని పక్కదోవ పట్టిస్తున్నాయని రామచందర్‌రావు ఆరోపించారు. పరస్పర బూతుల తిట్ల పురాణంతో, కేవలం టీఆర్పీలు, కెమెరా పబ్లిసిటీ స్టంట్ల కోసమే సభా సమయాన్ని, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వెల్‌లో బీజేపీ పక్షాన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, 22ఎ నిషేధిత భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఇచ్చిన వాయిదా తీర్మానాలు కూడా చర్చకు రాకుండా అడ్డుకున్నాయని విమర్శించారు. ఈ పార్టీలు తమ రాజకీయ స్వార్థాన్ని, నాటకాలను పక్కనపెట్టి మిగిలిన మూడు రోజుల సమావేశాలనైనా ప్రజా సమస్యలపై చర్చించేందుకు సద్వినియోగం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగుతుందంటూ కాంగ్రెస్‌బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని రామచందర్ హెచ్చరించారు.



# కాళోజీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 , ఆశ్వి అప్డేట్స్:**

కాళోజీ నారాయణరావు ప్రజల గొంతుకగా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైనిక కవిగా, ఖండాంతర కవిగా ప్రసిద్ధి చెందిన వి.ఆర్.విద్యార్థికి (వేలూరి రాములు) 2026 కాళోజీ నారాయణరావు సాహిత్య పురస్కారాన్ని ఆయన ప్రదానం చేశారు. కాళోజీ సాహిత్య వారసత్వాన్ని వి.ఆర్.విద్యార్థి వంటి వారు పుణికిపుచ్చుకుని ముందుకు తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కోరారు. తెలంగాణ ప్రజల జీవితం, బాధ, ఆశ, ఆకాంక్ష, పోరాటం, ఆత్మగౌరవం కాళోజీ రచనల్లో స్పష్టంగా ప్రతిబింబించాయన్నారు. 'నా గొడవ' కేవలం ఆయన వ్యక్తిగత గొడవ కాదని, సమాజంలోని అణగారిన, బాధిత, సామాన్య ప్రజల గొడవను తన గొడవగా కాళోజీ స్వీకరించారని మంత్రి చెప్పారు. ప్రజల సమస్యలను తన కలంతో వినిపించిన ప్రజాకవిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.

**నగరపర్యటనలను అన్వేషించండి**

**తెలంగాణ యాస.. కాళోజీ శ్వాస**

తెలంగాణ భాష, యాసపై కాళోజీకి ఉన్న ప్రగాఢ విశ్వాసం ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి జూపల్లి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ప్రథమ మహాసభలో తెలంగాణ బతుకు, భాషపై కాళోజీ చేసిన అధ్యక్షోపన్యాసం తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్రలో సువర్ణాధ్యాయమని అన్నారు.ప్రజలు మాట్లాడే భాషలోనే రచనలు చేయాలని కాళోజీ బలంగా విశ్వసించారని చెప్పారు.

**పలుకుబడుల భాషకు పెద్దపీట**

కాళోజీ దృష్టిలో భాషకు రెండు తీర్లు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఒకటి బడి పలుకుల భాష, మరొకటి పలుకుబడుల భాష అని వివరించారు. పుస్తకాల్లో, పండితుల రచనల్లో కనిపించే భాష కంటే ప్రజల నాలుకలపై సహజంగా నడయాడే పలుకుబడుల భాషలోనే నిజమైన జీవన వాస్తవికత ఉంటుందని కాళోజీ విశ్వసించారని చెప్పారు. తన పోరాటాలన్నింటికీ కాళోజీ కవిత్వాన్ని మాధ్యమంగా ఎంచుకున్నారని, చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, సరళంగా ప్రజల భాషలోనే చెప్పేవారని పేర్కొన్నారు. అందుకే ఆయన రచనలు సామాన్య ప్రజలకు మరింత చేరువయ్యాయన్నారు. తెలంగాణ యాసను, భాషను, ప్రజల పలుకుబడిని కాళోజీ సాహిత్యంలో గౌరవప్రదంగా నిలబెట్టారని జూపల్లి అన్నారు. తెలంగాణ మాండలికాన్ని తక్కువగా చూసే ధోరణులకు తన కలంతో సమాధానం చెప్పి తెలంగాణ యాస పట్ల తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని చాటుకున్నారని వెల్లడించారు. భాష సంభాషణకు ఉపయోగించే సాధనం మాత్రమే కాదని, ఒక జాతి చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతిబింబమని మంత్రి పేర్కొన్నారు. కాళోజీ అందించిన స్ఫూర్తిని కొనసాగించాలనే ఉద్దేశంతోనే ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీ కార్యాలయంలో కాళోజీ జయంతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:**

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను డీజీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సాహిత్య సేవలను, ప్రజా సమస్యలపై తన రచనల ద్వారా కల్పించిన చైతన్యాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఐజీ గజరావు భూపాల్, మల్టీ జోన్ II ఐజీ షానవాజ్ ఖాసిం, ఏఐజి అడ్మిన్ జె.అన్యోన్య , టి జి స్పార్క్ ఎస్పీ రూపేష్, పేషీ డీఎస్పీ భాస్కర్, స్టోర్స్ డీఎస్పీ సత్యనారాయణ, సీఎస్ఓ యోగేశ్వరరావు తోపాటు ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అసెంబ్లీ సాక్షిగా డ్రామాలాడుతున్నారు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:**

శాసనసభలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వీధి నాటకాలకు తెరతీశాయని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి బట్టబయలు కాకుండా రెండు పార్టీలు కుమ్మక్కై 'డూప్ ఫైటింగ్' డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. బుధవారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలులో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని లక్ష్మణ్ మండిపడ్డారు. రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పేద విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థగా మారిందని, ఎటువంటి విచారణ లేకుండా దాదాపు కోటి ఎకరాలను 22/A నిషేధిత జాబితాలో చేర్చి దందాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు సెటిల్మెంట్లు చేస్తూ ఆ డబ్బును ఢిల్లీకి కప్పంగా పంపుతున్నారని విమర్శించారు.

**నిరంకుశ పాలన..**

**రాజ్యాంగానికి అవమానం**

ప్రశ్నించే బీజేపీ నేతలను హౌస్ అరెస్టులు, అక్రమ కేసులతో అణచివేస్తున్న రేవంత్ పాలన.. ఇందిరమ్మ ఎమర్జెన్సీని, మమతా బెనర్జీ నిరంకుశత్వాన్ని తలపిస్తోందని విమర్శించారు. బాధ్యతగల ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్‌కే పరిమితం కావడం ప్రజాతీర్పును, రాజ్యాంగాన్ని అవమానించడమేనని దుయ్యబట్టారు.

**బహిరంగ చర్చకు సిద్ధం**

ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఈ ప్రాంతానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. పదేళ్ల మోదీ ప్రభుత్వమే తెలంగాణకు అత్యధికంగా నిధులు కేటాయించిందని స్పష్టం చేశారు. యూపీఏ హయాంలో రైల్వే బడ్జెట్ కింద కేవలం రూ. 886 కోట్లు ఇస్తే, మోదీ సర్కార్ రూ. 5,500 కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. వందే భారత్ రైళ్లు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్, గిరిజన వర్సిటీ, రామగుండం ఎరువుల కర్మాగారం వంటివి కేంద్రం ఇచ్చిందేనని తెలిపారు. ఈ అంశాలపై అసెంబ్లీలోనైనా, బహిరంగ వేదికపైనైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రాబోయే జమిలి ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి పట్టం కట్టడం ఖాయమని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు

# యూరియా యాప్‌ను రద్దు చేసే ప్రసక్తే లేదు

- **పారదర్శకత, రైతులకు సబ్సిడీ అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **రాష్ట్రం ఆదర్శంగా కేంద్రం తీసుకొచ్చిన ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్**
- **కౌలు రైతుల ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**



**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

పారదర్శకంగా రైతులకుసబ్సిడీ ఎరువులు అందించడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్' ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తి లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితర సభ్యులు బుధవారం అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. యాప్ అమలులో ఉన్న సాంకేతిక సమస్యలను అధిగమించి రైతులకు మరింత సులభంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గతంలో ఆధార్ ద్వారా ఎరువుల పంపిణీ జరిగేదని, అయితే వాస్తవంగా సాగు చేసే రైతులకే సబ్సిడీ ఎరువులు చేరాలన్న ఉద్దేశంతో ఈ యాప్‌ను తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. ఎరువుల అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్, పరిశ్రమలకు మళ్లింపు వంటి వాటికి చెక్ పెట్టి పారదర్శకతను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. యాప్ ద్వారా ఇప్పటివరకు 50 లక్షల మందికి పైగా రైతులు ఎరువులు కొనుగోలు చేశారని ఆయన సభ దృష్టికి తెచ్చారు.

**కేంద్రమూ అమలు చేస్తున్నది**

తెలంగాణ ప్రభుత్వం రబీ 202526 లో తెచ్చిన యూరియా బుకింగ్ యాప్ విజయవంతం కావడంతో దీన్ని ఆదర్శంగా తీసుకున్న కేంద్రం దేశవ్యాప్తంగా 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్‌ఎఫ్‌ఎస్) యాప్‌ను ప్రవేశపెట్టిందని మంత్రి తుమ్మల తెలిపారు. దీనిని రాష్ట్రవ్యాప్తంగా గత వారం నుంచే అమలు చేస్తున్నామన్నారు. ప్రారంభ దశలో ఉన్న కొన్ని సాంకేతిక సమస్యలను కేంద్ర సాంకేతిక బృందం సహకారంతో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సర్వర్ సామర్థ్యాన్ని కూడా పెంచుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ), మీసేవ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. గతంలో కమ్యూనికేషన్, రవాణా సదుపాయాలు లేని సమయంలో ప్రభుత్వం సొసైటీలకు రవాణా ఛార్జీలు భరించేదని, ఇప్పుడు ఆ పరిస్థితి మారడంతో ఆ విధానాన్ని ఉపసంహరించుకున్నామని మంత్రి చెప్పారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 12 వేల ఎరువుల విక్రయ కేంద్రాలు, డీలర్లు, సొసైటీల వద్ద ఒకే ధరకు యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. అలాగే కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

**కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలి**

కేంద్ర ప్రభుత్వం యూరియాపై ఎక్కువ సబ్సిడీ ఇస్తూ కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించకపోవడంతో రైతులు కేవలం యూరియా వైపు మొగ్గు చూపుతున్నారని తుమ్మల అన్నారు. దీని వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోందని, ఎరువుల ధరలను క్రమబద్ధీకరించాలని కేంద్రాన్ని పలుమార్లు కోరినట్లు తెలిపారు. యుద్ధ పరిస్థితుల కారణంగా దిగుమతుల్లో కొంత ఆలస్యమైనా రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని, గతంలో 1617 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉంటే ఇప్పుడు వాటిని 2223 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని మంత్రి వివరించారు.



# శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

- **నార్కట్‌పల్లిలో పీస్ కమిటీ సమావేశం**

**ఆశ్వి అప్డేట్స్ – నార్కట్‌పల్లి, సెప్టెంబర్ 9:**

రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, మత సామరస్యంతో నిర్వహించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ మతాలకు చెందిన మత పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ చట్టాలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతర మతాల మనోభావాలను గౌరవిస్తూ మత సామరస్యాన్ని కాపాడాలని అధికారులు కోరారు. పండుగను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ సిరికొండ సురేష్, ఎస్ఐ, మత పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- **రౌడీ షీటర్లకు నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి హెచ్చరిక**

**నల్గొండ, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:**

రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి రౌడీ షీటర్లను హెచ్చరించారు. బుధవారం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో నల్గొండ సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నల్గొండ టౌన్ పరిధిలోని 75 మందితో పాటు సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 150 మంది రౌడీ షీటర్లు కార్యక్రమానికి హాజరయ్యారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని విడిచిపెట్టి సాధారణ పౌరులుగా ప్రశాంతంగా జీవించాలని డీఎస్పీ సూచించారు. వినాయక ఉత్సవాల సందర్భంగా గొడవలు, అల్లర్లు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్‌తో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 125 మంది రౌడీ షీటర్లపై బైండ్ ఓవర్ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత ఎంఆర్‌ఓల వద్ద రూ.2 లక్షల బైండ్ ఓవర్, ఆరు నెలల కాల పరిమితితో చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. బైండ్ ఓవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.
రౌడీ షీటర్ల కదలికలు, ప్రవర్తనపై నిరంతరం నిఘా కొనసాగుతుందని డీఎస్పీ తెలిపారు. నేరాలకు దూరంగా ఉంటూ కుటుంబంతో గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, శివప్రసాద్, ముత్తయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవజాత శిశువు విక్రయ యత్నం కేసులో కీలక మలుపు

- **రూ.లక్షకు బేరం.. రూ.30 వేలకు తగ్గింపు | విచారణలో శిశువుకు అసలు తల్లేనని నిర్ధారణ**

**ఆశ్వి అప్డేట్స్ – ఎల్బీనగర్, సెప్టెంబర్ 9:**



నవజాత శిశువును విక్రయించేందుకు ప్రయత్నించినట్లు నమోదైన కేసులో పోలీసుల విచారణలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. శిశువుతో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళే ఆ శిశువుకు అసలు తల్లి అని విచారణలో నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో Cr.No.1202/2026, సెక్షన్ 81 JJ Act2015 కింద కేసు నమోదైంది. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. సుమారు ఎనిమిది రోజుల వయసున్న శిశువును దత్తతకు ఇస్తానంటూ ఓ మహిళ మొదట రూ.లక్ష డిమాండ్ చేసినట్లు తెలిపారు. అనంతరం రూ.30 వేలకు శిశువును ఇస్తానని చెప్పడంతో అనుమానం వచ్చిన ఫిర్యాదుదారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో సదరు మహిళకు, శిశువుకు ఉన్న సంబంధంపై వివరాలు సేకరించగా, ఆమెనే శిశువుకు జన్మనిచ్చిన తల్లిగా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (CWC) దృష్టికి తీసుకెళ్లారు. మహిళకు నోటీసు జారీ చేసి, ప్రస్తుతం CWC పర్యవేక్షణలో ఉంచినట్లు తెలిపారు. శిశువు భద్రత, సంక్షేమానికి సంబంధించిన తదుపరి చర్యలను CWC పర్యవేక్షిస్తోందని పోలీసులు వెల్లడించారు.





# పోలీసు సిబ్బందికి మెగా వైద్య శిబిరం

- **580 మంది సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు**

**ఆశ్వి అప్డేట్స్ – సూర్యాపేట, సెప్టెంబర్ 9:**

పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి సమర్థవంతమైన రక్షణ సేవలు అందించగలరని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో గుండె సంబంధిత, ఇతర ఆరోగ్య సమస్యలపై ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు.ఆర్వీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హెల్త్‌పై హాస్పిటల్, సూర్యాపేట కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎస్పీ నరసింహ ఇతర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటూ చాలాసార్లు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. "సూర్యాపేట పోలీస్ శాఖ అంతా ఒక కుటుంబం. సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యంపై శాఖ ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది" అని తెలిపారు. సమాజ రక్షణ కోసం రాత్రింబవళ్లు విధులు నిర్వహించే సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంతో ఆనందంగా గడపడంతో పాటు విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని పేర్కొన్నారు. పోలీసుల సంక్షేమం కోసం ఉచితంగా వైద్య సేవలు, సలహాలు అందించిన ఆసుపత్రుల వైద్య బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 580 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మీడియా ప్రతినిధులు కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరసింహాచారి, వివిధ విభాగాల పోలీసు అధికారులు, సిబ్బంది, వైద్యులు, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.



# డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి వినతి

- **వాటర్ వర్క్స్ ఎండీని కలిసిన మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి**

**వనస్థలిపురం, సెప్టెంబర్ 09 (ఆశ్వి అప్డేట్స్):**

వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని కొన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వనస్థలిపురం డివిజన్‌కు అవసరమైన డ్రైనేజీ పనులను మంజూరు చేసి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు కాలనీల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని రాగుల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

# మదనాపూర్ ఠాణాను తనిఖీ చేసిన ఎస్పీ సునిత రెడ్డి

- **గణేశ్ నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో – మదనాపూర్, సెప్టెంబర్ 9 – ఆశ్వి అప్డేట్స్:**

మదనాపూర్ పోలీస్ స్టేషన్‌ను వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్, రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.
బాధితులతో పారదర్శకంగా వ్యవహరిస్తూ, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. అనంతరం మండలంలోని గణేశ్ నిమజ్జన ప్రాంతాలైన సరళసాగర్, రామన్‌పాడ్, కొత్తపల్లి బ్రిడ్జి ప్రాంతాలను ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేయడం, ఈవ్‌టీజింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, సీఐలు శివకుమార్, ఓడి రమేష్, సుగంధరత్నం, ఎస్ఐ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# 13 రకాల విత్‌డ్రాలు 3 కేటగిరీలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ ఖాతా నుంచి నిధుల పాక్షిక ఉపసంహరణ (అడ్వాన్స్) నిబంధనలను సంస్థ గణనీయంగా సరళీకరించింది. గతంలో అమల్లో ఉన్న 13 రకాల సంక్లిష్ట ఉపసంహరణ పద్ధతులను రద్దు చేసి వాటి స్థానంలో కేవలం మూడు సులభతర విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నూతన నిబంధనల ప్రకారం, ఈపీఎఫ్‌లో సభ్యత్వం పొంది 12 నెలలు పూర్తి చేసుకున్న చందాదారులు తమ ఖాతాలోని నిల్వలో 75 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. అయితే, ఖాతాలో కనీసం 25 శాతం నిల్వను తప్పనిసరిగా కొనసాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ గతంలోనే ఆమోదం తెలిపింది. తాజా సవరణల ప్రకారం, ఉపసంహరణ ప్రక్రియను మూడు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు. అనారోగ్యం లేదా వైద్య చికిత్స నిమిత్తం సర్వీసు కాలంలో ఎన్నిసార్లయినా నిధులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే, చదువుల కోసం 10 సార్లు, వివాహ అవసరాల కోసం 5 సార్లు ఉపసంహరణకు అనుమతి ఇచ్చారు. ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణాల చెల్లింపు లేదా ఇంటి మరమ్మతుల కోసం సర్వీసు మొత్తంలో ఐదుసార్లు అడ్వాన్స్ పొందే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు, సంస్థ మూసివేత, ఉద్యోగం కోల్పోవడం లేదా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు నిధులు ఉపసంహరించుకునే వెసులుబాటు కల్పించారు.

# గణేశ్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

- **అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: సీపీ సజ్జనార్**

**ఆశ్వి అప్డేట్స్ – హైదరాబాద్, సెప్టెంబర్ 9:**

గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐపీఎస్ సూచించారు. బుధవారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆయన అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గణేశ్ విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్లకు అడ్డంగా వేలాడుతున్న విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ వైర్లను వెంటనే తొలగించి తగినంత క్లియరెన్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. మండపాలకు నిబంధనల ప్రకారం సురక్షిత విద్యుత్ కనెక్షన్లు, ఎర్తింగ్, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అనుమతులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రధాన, ఫీడర్ రూట్లలో కొనసాగుతున్న రోడ్డు, నాలా, స్లాబ్ పనులను సెప్టెంబర్ 14/15 నాటికి పూర్తి చేయాలని, నిమజ్జనం పూర్తయ్యే వరకు కొత్తగా రోడ్ల తవ్వకాలు, కేబుల్ పనులు చేపట్టవద్దని అధికారులకు సూచించారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణ పనుల కారణంగా విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో 26 ప్రాంతాలతో పాటు బాలాపూర్ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్సులు, పారామెడికల్ సిబ్బందిని 24 గంటలూ అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు తగిన పార్కింగ్ ప్రాంతాలను సిద్ధం చేయడంతో పాటు అవసరమైన బస్సులు, వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ, రవాణా శాఖలకు సూచించారు. నిమజ్జనానికి వినియోగించే క్రేన్లు, ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, మెయింటెనెన్స్ బృందాల వివరాలను ముందుగానే పోలీసులకు అందించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 25న జరిగే ప్రధాన నిమజ్జనం సందర్భంగా ప్రజల సౌకర్యార్థం మెట్రో రైలు సేవలను అర్ధరాత్రి 1 గంట వరకు, ఎంపిక చేసిన స్టేషన్ల నుంచి ఎంఎంటీఎస్ రైళ్లను రాత్రంతా నడిపించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. సమన్వయ సమావేశంలో పోలీస్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, హైడ్రా, ఆర్టీసీ, ఫైర్ సర్వీసెస్, ఆరోగ్య, విద్యుత్, రవాణా, ఆర్‌అండ్‌బీ, వాటర్ వర్క్స్, మెట్రో, ఎంఎంటీఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.








# మధుయాష్కి గౌడ్‌కు కీలక బాధ్యతలు








Phone: (O): 011-23019320
011-23019080
E-mail: kcvenugopal.org@gmail.com
kcvenugopal.in@gmail.com
Website: www.inc.in

ALL INDIA CONGRESS COMMITTEE

K.C. Venugopal, M.P.
General Secretary

24, AKBAR ROAD,
NEW DELHI-110 011

September 09, 2026

PRESS RELEASE

Hon'ble Congress President has appointed Shri Madhu Goud Yaskhi as the Chairperson of the All India Professionals' Congress, with immediate effect.

The party appreciates the contributions of outgoing Chairperson, Shri Praveen Chakravarty.

(K. C. Venugopal)

- **AIPC చైర్‌పర్సన్‌గా నియామకం.. ప్రొఫెషనల్స్‌ను కాంగ్రెస్‌తో అనుసంధానించడంపై దృష్టి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (ఆశ్వి అప్డేట్స్):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌కు పార్టీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (AIPC) చైర్‌పర్సన్‌గా ఆయనను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కే.సి. వేణుగోపాల్ అధికారికంగా ప్రకటించారు.

**ప్రొఫెషనల్స్‌తో పార్టీ అనుసంధానానికి కీలక వేదిక**

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ప్రధానంగా దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న నిపుణులు, మేధావులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వైద్యులు, న్యాయవాదులు, ఇతర వృత్తి నిపుణులను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానించే వేదికగా పనిచేస్తోంది. ప్రస్తుతం రాజకీయాల్లో విధానపరమైన చర్చలు, ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, విద్య, వైద్యం, ఉపాధి, పట్టణాభివృద్ధి వంటి అంశాలపై నిపుణుల అభిప్రాయాలకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో AIPC బాధ్యతలు మరింత ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో మధుయాష్కి గౌడ్‌కు సంస్థ చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించడం పార్టీ వ్యూహాత్మక నిర్ణయంగా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

**జాతీయ స్థాయిలో కొత్త బాధ్యత**

మధుయాష్కి గౌడ్‌కు గతంలో ఎంపీగా, కాంగ్రెస్ పార్టీలో వివిధ బాధ్యతల్లో పనిచేసిన అనుభవం ఉంది. రాజకీయ వ్యవహారాలతో పాటు ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలు, మీడియా మరియు ప్రజలతో అనుసంధానం వంటి అంశాల్లో ఆయనకు ఉన్న అనుభవం AIPC కార్యకలాపాలకు ఉపయోగపడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

AIPC ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రొఫెషనల్స్‌ను గుర్తించడం, వారితో విధానపరమైన అంశాలపై చర్చించడం, ప్రజా సమస్యలపై నిపుణుల సూచనలను పార్టీ విధాన చర్చల్లోకి తీసుకురావడం వంటి అంశాలు ముందున్న ప్రధాన బాధ్యతలుగా నిలవనున్నాయి.

**పార్టీకి, ప్రొఫెషనల్స్‌కు మధ్య వారధిగా**

ప్రస్తుతం యువత, నిపుణులు, స్టార్టప్ రంగం, ఐటీ, వైద్య, న్యాయ, విద్యా రంగాలకు చెందిన వర్గాలు ప్రజా విధానాలపై చురుకైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ వర్గాలను రాజకీయ ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం ఏఐపీసీకి ముఖ్యమైన లక్ష్యంగా ఉంది. ఈ క్రమంలో మధుయాష్కి గౌడ్ ముందుగా పార్టీకి దూరంగా ఉన్నట్లు భావించే ప్రొఫెషనల్ వర్గాలతో కూడా విస్తృతంగా సంప్రదింపులు జరిపి, వారిని పార్టీ ఆలోచనా విధానంతో అనుసంధానించే ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా సోషల్ మీడియా, డిజిటల్ కమ్యూనికేషన్, పాలసీ డిస్కషన్స్, యువ ప్రొఫెషనల్స్ భాగస్వామ్యం వంటి అంశాలు ఆయన ముందున్న కీలక అవకాశాలుగా కనిపిస్తున్నాయి.

**గత నాయకత్వానికి పార్టీ ప్రశంసలు**

ఇప్పటివరకు AIPC చైర్‌పర్సన్‌గా సేవలందించిన ప్రవీణ్ చక్రవర్తి అందించిన సేవలను కాంగ్రెస్ పార్టీ అభినందించింది. ఆయన నాయకత్వంలో సంస్థకు అందించిన సహకారాన్ని పార్టీ అధిష్ఠానం ప్రశంసించింది.

కొత్త నాయకత్వంలో AIPC కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, దేశవ్యాప్తంగా వివిధ రంగాల నిపుణులను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానించే దిశగా సంస్థ ముందుకు సాగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

**మధుయాష్కి ముందున్న సవాళ్లు**

కొత్త బాధ్యతలు స్వీకరించిన అనంతరం మధుయాష్కి గౌడ్‌కు సంస్థను జాతీయ స్థాయిలో మరింత క్రియాశీలంగా తీర్చిదిద్దడం ప్రధాన సవాలుగా నిలవనుంది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌లను బలోపేతం చేయడం, కొత్త సభ్యులను ఆకర్షించడం, నిపుణుల అభిప్రాయాలను పార్టీ విధాన చర్చలకు అనుసంధానం చేయడం కీలకంగా మారనుంది. అదేవిధంగా మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో ప్రొఫెషనల్స్ ఆశలు, యువత ఆలోచనలు, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకుని వాటిని పార్టీ విధాన చర్చల్లో ప్రతిబింబించేలా చేయడం కూడా ఆయన బాధ్యతల్లో ఒకటిగా ఉండనుంది. మొత్తంగా చూస్తే, AIPC చైర్‌పర్సన్‌గా మధుయాష్కి గౌడ్ నియామకం ఆయనకు వ్యక్తిగతంగా మరో కీలక బాధ్యత కాగా, ప్రొఫెషనల్ వర్గాలతో కాంగ్రెస్ పార్టీ అనుసంధానాన్ని పెంచుకునే ప్రయత్నంలో కూడా ఇది ప్రాధాన్యత కలిగిన నియామకంగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

**కాసోజు శంకరాచారి**
**అసోసియేట్ ఎడిటర్**

# జిల్లా పబ్లిసిటీ సెల్ కన్వీనర్‌గా ఆనంద్ వ్యాస్

- **నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 9 (ఆశ్వి అప్డేట్స్):**

భారతీయ జనతా పార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా పబ్లిసిటీ సెల్ కన్వీనర్‌గా రాంగోపాల్‌పేట్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఆనంద్ వ్యాస్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గుండుగోని భరత్ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ వ్యాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు ఆనంద్ వ్యాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సారంగపాణి, నెమలి ఆనంద్, రమేష్ రామ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి కిరణ్ కుమార్, రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు భవర్లాల్, సందీప్ వర్మ, ప్రధాన కార్యదర్శి అనిష్ పర్మ తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మహత్యల నివారణకు 'Each One Save One' ఉద్యమం

- **తెలంగాణ గవర్నర్‌ను కలిసిన గ్రూప్ కెప్టెన్ జి.జె. రావు – ఆత్మహత్యల నివారణపై విస్తృత అవగాహనకు విజ్ఞప్తి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:** ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కర్గిల్ యుద్ధ వీరుడు, ఆత్మహత్యల నివారణ ఉద్యమకర్త గ్రూప్ కెప్టెన్ జి.జె. రావు తెలంగాణ గౌరవ గవర్నర్‌ను కలిసి ఆత్మహత్యల నివారణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా "Each One Save One" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన గవర్నర్‌ను కోరారు. ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న వారిలో మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులను గుర్తించి, వారితో మాట్లాడి, అవసరమైన సమయంలో సహాయం అందిస్తే ఎంతో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

ఆత్మహత్యల నివారణ అనేది ఒక్క ప్రభుత్వానికో, ఒక్క సంస్థకో పరిమితమైన బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని గ్రూప్ కెప్టెన్ జి.జె. రావు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, సహచరులు మరియు సామాజిక సంస్థలు పరస్పరం సహకరిస్తూ బాధలో ఉన్న వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**దేశానికి అంకితంగా చిత్రం**

ఆత్మహత్యల నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన తన చిత్రాన్ని దేశానికి అంకితం చేస్తున్నట్లు గ్రూప్ కెప్టెన్ జి.జె. రావు తెలిపారు. ఈ చిత్రం ద్వారా ఆత్మహత్యల నివారణ, ఆశ, జీవితం పట్ల సానుకూల దృక్పథం వంటి అంశాలపై ప్రజలకు సందేశం అందించడమే తన లక్ష్యమన్నారు. ప్రజల్లో ఆత్మహత్యల నివారణపై అవగాహన పెంచేందుకు మీడియా సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ విభాగాలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. "ఒక్కరి ప్రాణాన్ని కాపాడటం అంటే ఒక కుటుంబాన్ని కాపాడటమే. ప్రతి ఒక్కరం ఒక్కరిని కాపాడేందుకు ముందుకు వస్తే ఎన్నో ప్రాణాలను నిలబెట్టగలం" అనే సందేశంతో 'Each One Save One' కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యల నివారణకు తక్కువ వ్యయంతో, స్థిరమైన మరియు సమాజానికి అందుబాటులో ఉండే చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సంక్షోభంలో ఉన్న వ్యక్తులకు సమయానుకూలంగా వినడం, మాట్లాడటం, మద్దతు ఇవ్వడం, అవసరమైన నిపుణుల సహాయానికి అనుసంధానం చేయడం వంటి చర్యలు ప్రాణాలను కాపాడటంలో కీలకమని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచి, ప్రతి ప్రాణం విలువైనదేననే భావనను బలపరచడమే తన జీవిత లక్ష్యమని గ్రూప్ కెప్టెన్ జి.జె. రావు పేర్కొన్నారు.








# విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- **బీసీ, ఎస్సీ, ఎస్టీ-జేఏసీ నాయకుల డిమాండ్**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 9 (ఆశ్వి అప్డేట్స్):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీజేఏసీ రాష్ట్ర నాయకుడు బింగి రాము యాదవ్, ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు వీరపాగ శివ మహారాజ్ డిమాండ్ చేశారు.

బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బింగి రాము యాదవ్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించలేక కొంతమంది విద్యార్థులు చదువులు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరపాగ శివ మహారాజ్ మాట్లాడుతూ ఈ సమస్య లక్షలాది విద్యార్థులు, వారి కుటుంబాలపై ప్రభావం చూపుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ స్టూడెంట్ యూనియన్ నాయకులు శివ, సుబ్బయ్య యాదవ్, మధు, సంధ్యారాణి, మన్యం, ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణతో పాటు పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ దుర్మార్గం

- **కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష గొంతు నొక్కుతోంది: మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి**

**నల్గొండ, సెప్టెంబర్ 9 (ఆశ్వి):**



తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా 17 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల మొత్తం సెషన్ కాలానికి సస్పెండ్ చేయడాన్ని నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సస్పెన్షన్ చర్య అప్రజాస్వామికమని ఆయన విమర్శించారు. ప్రజా సమస్యలపై శాసనసభలో ప్రతిపక్ష సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించకుండా అడ్డుకునేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని భూపాల్‌రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకలైన శాసనసభల్లో ప్రజాప్రతినిధులకు మాట్లాడే హక్కును కాలరాయడం సరికాదన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి సీనియర్ నేతలను సభ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటాన్ని కొనసాగిస్తుందని భూపాల్‌రెడ్డి తెలిపారు. ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగడతామని స్పష్టం చేశారు. సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నల్గొండ నియోజకవర్గ పార్టీ శ్రేణుల తరఫున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



# 53 ప్రార్థనా మందిరాల్లో ఏకకాలంలో దీపోత్సవం

- **దెందులూరు నియోజకవర్గంలో 'నిజం గెలిచింది' కార్యక్రమం**

**దుగ్గిరాల, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:**

దెందులూరు నియోజకవర్గంలో 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల పరిధిలోని 53 ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో బుధవారం సాయంత్రం 6 గంటలకు ఏకకాలంలో దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దుగ్గిరాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, నియోజకవర్గ పరిశీలకురాలు ఇందిరా ప్రియదర్శిని, కూటమి నాయకులు పాల్గొని 53 కొవ్వొత్తులను వెలిగించారు. 'నిజం గెలిచింది-ధర్మం నిలిచింది-ప్రజాస్వామ్యం వర్ధిల్లింది' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. 2023 సెప్టెంబర్ 9న చంద్రబాబు నాయుడు అరెస్టు రాజకీయ కక్ష సాధింపు చర్యగా జరిగిందని ఆరోపించారు. ఆయన 53 రోజులు జైలులో గడపడం వ్యక్తిగత శిక్ష మాత్రమే కాదని, రాష్ట్ర ప్రజలు కూడా ఆ పరిణామాలను ఎదుర్కొన్నారని అన్నారు. చంద్రబాబుపై నమోదైన కేసుల్లో దర్యాప్తు సంస్థలు ఆధారాలు చూపలేకపోయాయని, న్యాయస్థానాల్లో కేసులు కొట్టివేయబడటం ద్వారా నిజం గెలిచిందని ఆయన పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో 53 కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు.




# ఉల్లాస్ మేళాలో తెలంగాణ స్టాల్‌కు ప్రశంసలు

- **అక్షరాస్యత కార్యక్రమాలపై అధికారుల అభినందనలు.. రాజేశ్వరి సేవలకు ప్రత్యేక గుర్తింపు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 (ఆశ్వి అప్డేట్స్):**

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని జవహర్ బాల్ భవన్‌లో నిర్వహించిన ఉల్లాస్ మేళాలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన స్టాల్ విశేషంగా ఆకట్టుకుంది. తెలంగాణకు చెందిన అక్షరాస్యత కార్యక్రమాలు, లంబాడీ సంస్కృతి, స్థానిక కార్యక్రమాలను స్టాల్‌లో ప్రదర్శించారు.

అడిషనల్ సెక్రటరీ అర్చనా శర్మ అవస్తి ఐఏఎస్ తెలంగాణ స్టాల్‌ను సందర్శించి, రాష్ట్రంలో ఉల్లాస్ కార్యక్రమం అమలు తీరును అభినందించారు. మహిళా వాలంటీర్లు నిర్వహిస్తున్న అక్షరాస్యత కార్యక్రమాలను పరిశీలించారు. కాశిపేట మండలంలోని లంబాడీ తండాకు చెందిన వాలంటీర్ రాజేశ్వరి 312 మంది గ్రామస్థులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు 32 మందికి ఉచితంగా కుట్టు శిక్షణ అందించారు. ఆమె సేవలను గుర్తించిన నిర్వాహకులు రాజేశ్వరిని ప్రత్యేకంగా అభినందించి, సక్సెస్ స్టోరీగా ఇంటర్వ్యూ నిర్వహించారు. మేళాలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా లంబాడీ నృత్యం, బతుకమ్మ, బోనాలు, పోతురాజు ప్రదర్శనలు నిర్వహించారు. డెప్యూటీ డైరెక్టర్ పురుషోత్తం ఆధ్వర్యంలో డీఆర్‌పీలు, వాలంటీర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డెప్యూటీ డైరెక్టర్ జనరల్ మొహమ్మద్ నుమాన్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల అక్షరాస్యత కార్యక్రమాలు, సంస్కృతులు, సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఉల్లాస్ మేళా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల విజయవంతమైన కార్యక్రమాలను పరిశీలించడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా డెప్యూటీ డైరెక్టర్ అనిత మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల విజయగాథలను తెలుసుకోవడం తెలంగాణ బృందానికి ప్రోత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.



# బాబాల ఆస్తులు.. భక్తి వెనుక ఆర్థిక వ్యవస్థ ఎంత?

- **విశ్వాసం వ్యక్తిగతం.. కానీ సంస్థల లెక్కల్లో పారదర్శకత తప్పనిసరి**
- **కచ్చిర్ కాడి ముచ్చట్లు – విశ్లేషణ**

భారతదేశంలో ఆధ్యాత్మిక గురువులు, స్వామీజీలు, ఆశ్రమాలకు కోట్లాది మంది భక్తులు ఉన్నారు. భక్తి అనేది వ్యక్తిగత విశ్వాసం. అయితే ఆ విశ్వాసం ఆధారంగా ఏర్పడిన సంస్థలు భారీ స్థాయిలో భూములు, భవనాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ట్రస్టులు, కంపెనీలు, విరాళాలను నిర్వహిస్తున్నప్పుడు అది కేవలం ఆధ్యాత్మిక అంశంగా మాత్రమే చూడలేం. అక్కడ ఆస్తుల యాజమాన్యం, ఆదాయం, వ్యయం, ఆడిట్, పన్నులు, చట్టపరమైన రికార్డులు కూడా ముఖ్యమవుతాయి.

**దేరా సచ్చా సౌదా.. ఒక కీలక ఉదాహరణ**

2017లో దేరా సచ్చా సౌదాకు చెందిన ఆస్తులపై హర్యానా ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు వివరాలను సేకరించాయి. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకారం, హర్యానాలోని 16 జిల్లాల్లో దేరాకు చెందిన భూముల విలువను అప్పటి కలెక్టర్ రేట్ల ప్రకారం కనీసం రూ.1,600 కోట్లుగా అంచనా వేశారు. సిర్సా జిల్లాలోనే 953 ఎకరాల భూమి విలువ సుమారు రూ.1,435 కోట్లుగా అంచనా వేయబడింది. ఈ లెక్కల్లో ఇతర భవనాలు, వ్యాపార యూనిట్ల విలువ పూర్తిగా చేరలేదని కూడా నివేదిక పేర్కొంది.

ఇక్కడ ప్రధానంగా గమనించాల్సింది ఒకటే—సంస్థ ఆస్తిని సంస్థ అధిపతి వ్యక్తిగత ఆస్తిగా పరిగణించడం సరైనది కాదు. సంస్థ, ట్రస్ట్, కంపెనీ, వ్యక్తిగత యాజమాన్యం మధ్య చట్టపరమైన తేడా ఉంటుంది.

**అసలు ప్రశ్న ఆస్తి ఎంత అన్నది కాదు**

ఒక ఆధ్యాత్మిక సంస్థ దగ్గర వందల కోట్లు లేదా వేల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయా అన్నదే ప్రధాన ప్రశ్న కాదు.

**అవి ఎలా ఏర్పడ్డాయి?**
**ఎవరి పేరులో ఉన్నాయి?**
**విరాళాల రూపంలో వచ్చిన నిధులు ఎలా వినియోగిస్తున్నారు?**
**ఆదాయం–వ్యయాలపై ఆడిట్ జరుగుతోందా?**
**ఆస్తులు ప్రజా సేవకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయి?**
**ఇవే అసలు ప్రశ్నలు.**

ఇటీవల ఆలయ ఆస్తుల విషయంలోనూ పారదర్శకతపై చర్చ పెరుగుతోంది. ఉదాహరణకు, తమిళనాడులో దేవాలయాల ఆస్తులను ప్రజలకు వెల్లడించాలంటూ సమాచార కమిషన్ ఆదేశించినట్లు సెప్టెంబర్ 2026లో నివేదిక వెలువడింది.

అంటే విషయం ఒక్క బాబాలకు మాత్రమే పరిమితం కాదు. ప్రజా విశ్వాసంతో నడిచే ప్రతి పెద్ద ఆధ్యాత్మిక సంస్థకు పారదర్శకత అనే ప్రమాణం వర్తించాలి.

**రామ్‌దేవ్–పతంజలి విషయంలోనూ ఇదే సూత్రం**

బాబా రామ్‌దేవ్‌తో అనుబంధమున్న పతంజలి సంస్థలను ప్రస్తావించినప్పుడు కూడా కంపెనీ ఆస్తులు, ట్రస్టుల ఆస్తులు, వ్యక్తిగత ఆస్తులను కలిపి ఒకే మొత్తంగా చెప్పడం సరైన విశ్లేషణ కాదు.
కంపెనీకి చెందిన ఆస్తి కంపెనీదే.
ట్రస్ట్‌కు చెందిన ఆస్తి ట్రస్ట్‌దే.
వ్యక్తిగత ఆస్తి వ్యక్తిగత యాజమాన్యానిదే.

కాబట్టి "బాబా ఆస్తి ఇన్ని వేల కోట్లు" అనే సంచలనాత్మక శీర్షిక కంటే, ఏ సంస్థకు ఎంత ఆస్తి ఉంది? దాని యాజమాన్య నిర్మాణం ఏమిటి? ఆర్థిక లావాదేవీలు ఎలా జరుగుతున్నాయి? అనే అంశాలను పత్రాల ఆధారంగా విశ్లేషించడమే బాధ్యతాయుతమైన జర్నలిజం.

**భక్తి పేరుతో ప్రశ్నలు ఆగిపోవాలా?**
**భక్తిని ప్రశ్నించాల్సిన అవసరం లేదు.**

కానీ భక్తి పేరుతో నిర్వహించే సంస్థల ఆర్థిక వ్యవహారాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు.

ఒక భక్తుడు తన డబ్బును విరాళంగా ఇవ్వవచ్చు. ఒక సంస్థ ఆ డబ్బును సేవా కార్యక్రమాలకు వినియోగించవచ్చు. అదే సమయంలో ఆ నిధుల వినియోగంపై చట్టబద్ధమైన లెక్కలు ఉండటం కూడా అవసరం.

ప్రశ్న వ్యక్తిపై కాదు... వ్యవస్థపై.
ప్రశ్న విశ్వాసంపై కాదు... పారదర్శకతపై.
ప్రశ్న భక్తిపై కాదు... ఆర్థిక నిర్వహణపై.

**ప్రజలు అడగాల్సిన ఐదు ప్రశ్నలు**

1. ఆస్తి ఎవరి పేరులో ఉంది?
2. సంస్థకు వచ్చే ఆదాయ వనరులు ఏమిటి?
3. విరాళాలు ఎక్కడ ఖర్చవుతున్నాయి?
4. ఆర్థిక లావాదేవీలకు చట్టబద్ధమైన ఆడిట్ జరుగుతోందా?
5. ప్రజా సేవ పేరుతో సమకూరిన వనరులు నిజంగా ప్రజా ప్రయోజనానికే ఉపయోగపడుతున్నాయా?

ఈ ప్రశ్నలకు స్పష్టమైన పత్రాలు, ఆడిట్ నివేదికలు, ప్రభుత్వ రికార్డులు సమాధానంగా ఉంటే అనుమానాలకు అవకాశం తగ్గుతుంది.

**తుది విశ్లేషణ**

ఆధ్యాత్మికతను వ్యాపారంతో కలిపి చూడటం ఎంత తప్పో, వ్యాపార లేదా సంస్థాగత కార్యకలాపాలను కేవలం భక్తి పేరుతో ప్రశ్నించకూడదనడం కూడా అంతే తప్పు.

**భక్తి వ్యక్తిగత విశ్వాసం.**
**ఆస్తి సంస్థాగత బాధ్యత.**
**ప్రజా విరాళం ప్రజా నమ్మకం.**
**ఆ నమ్మకానికి లెక్కలు అవసరం.**

అందుకే బాబాల సంపదపై సంచలనాత్మక ఆరోపణల కంటే, ట్రస్టులు, కంపెనీలు, ఆస్తుల రిజిస్ట్రేషన్, విరాళాలు, ఆదాయ-వ్యయాలు, ఆడిట్ నివేదికలు, కోర్టు మరియు ప్రభుత్వ రికార్డుల ఆధారంగా విశ్లేషణ జరగాలి.

**బాబాను నమ్మడం భక్తుడి హక్కు...**
**లెక్కలు అడగడం ప్రజల హక్కు.**
**ఇదే ప్రజా చైతన్యం.**
**ఇదే కచ్చిర్ కాడి ముచ్చట్లు...**



– సకినాల సుధాకర్ పటేల్
సీనియర్ జర్నలిస్టు

---

## ఝార్ఖండ్ వోటర్ల జాబితాలో ఆఫ్ఘన్ జాతీయులు

- **దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి**

**జంషెడ్‌పూర్, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:**

ఝార్ఖండ్‌లో నిర్వహించిన వోటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వోటర్ల ముసాయిదా జాబితాలో ఏకంగా ముగ్గురు ఆఫ్ఘనిస్థాన్ పౌరుల పేర్లు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ముసాయిదా వోటర్ల జాబితా పరిశీలన, పత్రాల ధృవీకరణ సమయంలో అధికారులు ఈ వ్యత్యాసాన్ని కనిపెట్టారు. నోటీసులు జారీ చేసినప్పటికీ, వారు సరైన భారతీయ పౌరసత్వ పత్రాలను సమర్పించలేకపోయారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టులు లభించడంతో వారు విదేశీయులని నిర్ధారణ అయింది. ఝార్ఖండ్ సీఈవో కేజీ రవికుమార్ ఈ అంశాన్ని ధ్రువీకరిస్తూ విదేశీ పౌరుల పేర్లను వోటర్ల జాబితా నుండి తక్షణమే తొలగించినట్లు వెల్లడించారు. విదేశీ పౌరులకు భారతీయ వోటరు కార్డులు లభించేలా వెనుకుండి సహకరించిన వ్యక్తులు, అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురి కుటుంబ సభ్యుల పత్రాలపై కూడా తనిఖీలు జరుపుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి విదేశీయుల పేర్లు నమోదయ్యాయా అన్న కోణంలో దర్యాప్తు వేగవంతం చేసినట్లు వెల్లడించారు.

---

# రూ.10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

- **దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్**
- **రాష్ట్రంలో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్**
- **కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు**
- **మీడియాకు వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం తెలంగాణలోని ఘట్‌కేసర్‌కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణంరేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029 30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మేజూన్ నాటికి టెస్టింగ్ కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్ పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. ఇందులో, అరక్కోణం రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్ కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్‌బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలంకరూర్‌దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్‌ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది.ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు రైలు మార్గాలు మెరుగుపడనున్నట్లు తెలిపింది. తారాతరిణి ఆలయం, జగన్నాథ ఆలయం(ఝార్సుగూడ సమీపంలోని పురాతన ఆలయం), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణాకు కూడా ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయి.



ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులు ప్రణాళిక రచించారు. ఈ ప్రాజెక్టులు ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు నిరంతరాయ అనుసంధానాన్ని అందిస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది. రైల్వే నెట్‌వర్క్ పెరగడం వల్ల దేశంలో చమురు దిగుమతులు తగ్గుతాయని అభిప్రాయపడింది. దాదాపు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతి ఆదా అవుతుందని తెలిపింది. అలాగే, 62 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని పేర్కొంది.

**ఘట్ కేసర్ – కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవున నాలుగో లైన్**

కాజీపేట/హైదరాబాద్, ప్రజాతంత్ర, సెప్టెంబర్ 9 : తెలంగాణలోని అత్యంత కీలకమైన ఘట్‌కేసర్ కాజీపేట సెక్షన్ మధ్య 110 కిలోమీటర్ల పొడవునా నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు అంచనా విలువను రూ.2,419 కోట్లుగా ప్రభుత్వం నిర్ధారించింది. సికింద్రాబాద్‌కాజీపేట మార్గంలో రైళ్ల రద్దీ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఈ నాలుగో లైన్ అందుబాటులోకి వస్తే సరుకు రవాణాతోపాటు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేగం, సమయపాలన మెరుగుపడనుంది.

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం**

సికింద్రాబాద్ - కాజీపేట్ మధ్య మల్టీ ట్రాకింగ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించడం పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మోదీకి, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రైల్వే బడ్జెట్ కేటాయింపులు 21 రెట్లు పెరిగాయని, గత పన్నెండేళ్ల కాలంలో రూ.36,286 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. దీంతోపాటు రాష్ట్రంలో దాదాపు రూ.50 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని, మరో రూ.50 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఫైనల్ లొకేషన్ సర్వే జరుగుతోందని పేర్కొన్నారు. రైల్వే లైన్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు, ప్రస్తుతం 42 స్టేషన్లలో దాదాపు రూ.3,000 కోట్లతో అత్యాధునిక మౌలిక సదుపాయాలను కల్పించి అమృత్ భారత్ స్టేషన్లుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామన్నారు.

---

# 170 ఏళ్ల హనుమంతుడి విగ్రహం కదలలేదు!

- **రోడ్డు విస్తరణలో సాంకేతికతకు చిక్కని ముడి**
- **విగ్రహం తరలింపుపై భక్తుల ఆగ్రహం**

**ఉజ్జయిని, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:**

సింహస్థ 2028 కుంభమేళా ఏర్పాట్లలో భాగంగా చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కంతాల్ నుంచి ఛత్రీ చౌక్ వైపు వెళ్లే మార్గంలో ఉన్న సుమారు 170 ఏళ్లనాటి ఖడే హనుమాన్ విగ్రహాన్ని తరలించేందుకు అధికారులు, ఇంజనీర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇండోర్ నుంచి ప్రత్యేకంగా రప్పించిన నిపుణులు అత్యాధునిక సాంకేతికతతో ప్రయత్నించినా.. రెండు రోజులుగా విగ్రహం అంగుళం కూడా కదలలేదు. దీంతో ఇది దైవ శక్తి మహిమేనని స్థానికులు, భక్తులు విశ్వసిస్తున్నారు.

**రాజసవారీకి సమయం తక్కువ**

మరో రెండు రోజుల్లో ఇదే మార్గం మీదుగా శ్రీ మహాకాళేశ్వరుడి రాజసవారీ జరగాల్సి ఉంది. దీంతో విగ్రహం తరలింపు వ్యవహారం యంత్రాంగానికి సవాలుగా మారింది. ప్రస్తుతానికి విగ్రహానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా భద్రత కోసం అక్కడ టెంట్ ఏర్పాటు చేశారు. ఈ పరిణామంతో ఆలయం పరిసరాల్లో భక్తిమయ వాతావరణం నెలకొంది.

**ఆలయ గోడ కూల్చివేతపై ఆగ్రహం**

ఆలయ కాంపౌండ్ గోడను అధికారులు ఇప్పటికే కూల్చివేయడంపై స్థానికులు, హిందూ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వందలాది మంది కార్యకర్తలు, భక్తులు ఆలయం వద్ద మహాహారతి నిర్వహించారు. ఆలయానికి ఇరువైపులా ఇప్పటికే రహదారి ఉన్నందున నిర్మాణాల తొలగింపుపై అధికారులు పునరాలోచించాలని పూజారి సులభ్ శాంతను శర్మ, కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

**లిఖితపూర్వక హామీ ఇవ్వాలి**

టాంకీ చౌక్ వద్ద ఎలాంటి నష్టం జరగకుండా విగ్రహాన్ని సురక్షితంగా తరలించి పునఃప్రతిష్ఠిస్తామని అధికారులు లిఖితపూర్వక హామీ ఇచ్చిన తర్వాతే విగ్రహాన్ని తరలించేందుకు అనుమతిస్తామని పూజారి స్పష్టం చేశారు. లేదంటే విగ్రహాన్ని ముట్టుకునేందుకు కూడా అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు.



**పునాది స్కానింగ్ తర్వాతే నిర్ణయం**

పరిస్థితి సున్నితంగా మారడంతో తొందరపాటు నిర్ణయం తీసుకోకూడదని యంత్రాంగం భావిస్తోంది. పూర్తి గౌరవంతో, సురక్షిత పద్ధతిలోనే విగ్రహాన్ని టాంకీ చౌక్‌కు తరలించాలనేది తమ ఉద్దేశమని తహసీల్దార్ షెఫాలీ జైన్ తెలిపారు. ఇప్పటికే విగ్రహం పునాది పరిస్థితిని తెలుసుకునేందుకు 1.5 అడుగుల మేర గుంత తవ్వారు. అనంతరం పురావస్తు శాఖ నిపుణుల బృందాన్ని రంగంలోకి దించారు. అత్యాధునిక యంత్రాలతో విగ్రహం పునాది, లోపలి నిర్మాణం, చుట్టుపక్కల నేల స్వభావాన్ని వారు పరిశీలిస్తున్నారు. స్కానింగ్ నివేదిక వచ్చిన తర్వాతే విగ్రహాన్ని తరలించేందుకు అనుసరించాల్సిన సాంకేతికతపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

---

# వైవాహిక అత్యాచారంపై సుప్రీంకోర్టులో కీలక విచారణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10, ఆశ్వి అప్డేట్స్:**

వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పెళ్లయినంత మాత్రాన మహిళ వ్యక్తిగత స్వయంప్రతిపత్తి, స్వేచ్ఛకు భంగం కలగకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. భార్య సమ్మతి లేకుండా భర్త లైంగిక సంబంధం పెట్టుకున్నా అత్యాచారంగా పరిగణించని చట్టపరమైన మినహాయింపును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై ధర్మాసనం విచారణ ప్రారంభించింది.

**ప్రత్యేక ధర్మాసనం విచారణ**

సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ జాయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం కేసును విచారిస్తోంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అఫిడవిట్ దాఖలు చేసినట్లు కోర్టు తెలిపింది. అన్ని పక్షాలు సమర్పించిన వాదనలను సమగ్రంగా క్రోడీకరించాలని ఆదేశించింది. వ్యాజ్యాలపై ప్రతి బుధవారం, గురువారం తుది విచారణ కొనసాగుతుందని ధర్మాసనం వెల్లడించింది.

**మినహాయింపు తొలగింపును వ్యతిరేకించిన కేంద్రం**

ఐపీసీ సెక్షన్ 375, ప్రస్తుతం అమల్లో ఉన్న బీఎన్‌ఎస్ సెక్షన్ 63 ప్రకారం 18 ఏళ్లు పైబడిన భార్యతో భర్త జరిపే లైంగిక చర్యలకు అత్యాచారం నిబంధన నుంచి మినహాయింపు ఉంది. దీనిని తొలగిస్తే వివాహ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు కుటుంబ, సామాజిక సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని కేంద్రం గతంలో సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ అంశాన్ని కేవలం చట్టపరమైన కోణంలో కాకుండా సామాజిక పరిణామాలను పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా పరిశీలించాలని కోరింది.

**హైకోర్టుల భిన్న తీర్పులు**

వైవాహిక అత్యాచార మినహాయింపుపై ఢిల్లీ హైకోర్టులో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడగా.. మరో న్యాయమూర్తి దాన్ని సమర్థించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఖుష్బూ సైఫీ, ఆర్ఐటీ ఫౌండేషన్, ఆలిండియా డెమోక్రటిక్ విమెన్స్ అసోసియేషన్ తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

---

# పార్లమెంటరీ విలువలే ప్రధానం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9, ఆశ్వి అప్డేట్స్:**

ప్రజాస్వామ్య దేవాలయాలైన చట్టసభల్లో పార్టీల కంటే పార్లమెంటరీ విలువలే ప్రధానమని, ప్రజాప్రతినిధుల ప్రవర్తనలో మార్పు రావాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన 'సంసద్ రత్న' అవార్డుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కీలక ప్రసంగం చేశారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయాలి, ప్రశ్నించాలి కానీ చట్టసభలను అడ్డుకోవడం సరికాదు. ఒకప్పటి హుందాతనం లోపించి రాజకీయ విలువలు దిగజారుతుండటం భవిష్యత్ తరాలకు తప్పుడు సందేశం ఇస్తోంది. ఇటీవల తెలంగాణ అసెంబ్లీలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు అత్యంత అప్రజాస్వామికంగా ఉందని విమర్శించారు. చొక్కాలు విప్పామని, విప్పించామని సంబరపడటం ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు తెస్తుందని మండిపడ్డారు.




**స్పీక్ ఔట్.. లేదా వాకౌట్**

ప్రభుత్వ తీరు నచ్చకపోతే సునిశితంగా విమర్శించాలి (స్పీక్ ఔట్), లేదంటే వాకౌట్ చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు చెప్పేవారని, కానీ నేటి విపక్షాలు సభలో గందరగోళం సృష్టించడంపైనే దృష్టి పెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీల సిద్ధాంతాలు వేరైనా దేశ ప్రయోజనాల విషయంలో అంతా ఏకతాటిపై నిలబడాలి. ఎన్నికల కమిషన్ వంటి స్వతంత్ర రాజ్యాంగ సంస్థలపై నిరాధార ఆరోపణలు చేసి ప్రజల్లో వాటిపై నమ్మకం పోగొట్టడం సరికాదని హితవు పలికారు.

**నా ఎదుగుదల ప్రజాస్వామ్య గొప్పదనమే**

సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను ఈ స్థాయికి ఎదగడం భారత ప్రజాస్వామ్య గొప్పదనమేనని ఆయన అన్నారు. వాజపేయి, పీవీ నరసింహారావు లాంటి వారి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన తాను.. ఏనాడూ అసెంబ్లీ వెల్‌లోకి అడుగుపెట్టలేదని, సభ జరిగిన ప్రతిరోజూ హాజరయ్యానని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన 16 మంది ఎంపీలకు 'సంసద్ రత్న' అవార్డులను అందజేశారు. ఈ వేడుకలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత్ మజూందార్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, మాజీ మంత్రి హన్సరాజ్ గంగారాం ఆహిర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# లెమన్ జ్యూస్... సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయ్ జాగ్రత్త!



నిమ్మరసం ఆరోగ్యానికి మంచిదే.. నిమ్మరసం తాగితే మన శరీరానికి కావాల్సిన సి విటమిన్ దొరుకుతుందని, అంతే కాదు నిమ్మరసంలో ఉండే పోషకాలు మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయని చెబుతారు. అయితే కొంతమందికి నిమ్మరసం తాగడం ఏ మాత్రం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారు పొరపాటున కూడా నిమ్మరసాన్ని తీసుకోకూడదని చెబుతున్నారు.



## ఈ సమస్యలుంటే వద్దు...

నిమ్మకాయలో ఉండే విటమిన్ సి ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ నిమ్మరసాన్ని పరిమితంగానే తీసుకోవాలి. అలాగే కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారు నిమ్మరసానికి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. దంతాల సమస్య ఉన్నవారు నిమ్మరసాన్ని తీసుకుంటే ఎక్కువ నీటిలో కలుపుకొని తీసుకోవాలి. లేదంటే దంతాల సమస్య తీవ్రంగా మారుతుంది.

దంతాల సమస్య, అలెర్జీలు ఉన్నవారు జాగ్రత్త మరీ తక్కువ నీటిలో లేదా నిమ్మరసాన్ని నేరుగా తీసుకున్న దంతాలు బాగా దెబ్బతిని ఇబ్బంది పడతారు. ఇక కొంతమందికి సిట్రస్ పండ్లను తింటే దురద, దద్దుర్లు వంటివి వస్తాయి. అలర్జీ సమస్యతో బాధపడేవారు నిమ్మరసానికి దూరంగా ఉండాలి. కొంతమందికి నిమ్మరసాన్ని తీసుకుంటే పెదవులు, నాలుక పైన, గొంతులోన వాపు వస్తుంది. అలాంటివారు నిమ్మరసానికి దూరంగా ఉండాలి.

## మెడిసిన్ వాడేవారికి కష్టమే...

కొన్ని రకాల ఆరోగ్య సమస్యలకు మెడిసిన్ వాడేవారు నిమ్మరసం తాగితే వాటి ప్రభావం సరిగా పనిచేయదు. కాబట్టి వారు కూడా నిమ్మరసానికి దూరంగా ఉండాలి. నిమ్మకాయ కాలేయం యొక్క ఎంజైములను ప్రభావితం చేయడం వల్ల మందులు వాడే వారిలో ఆ మందులు పనిచేయకుండా పోతాయని చెబుతారు.

## యాసిడ్, అల్సర్స్ ఉంటే నో..

అంతే కాదు కొంతమంది ఎసిడిటీతో బాధపడుతూ ఉంటారు. కడుపులో యాసిడ్ సమస్యతో బాధపడేవారు పొట్టలో యాసిడ్ రియాక్షన్స్ జరిగినప్పుడు, అల్సర్ సమస్య ఉన్నప్పుడు నిమ్మరసాన్ని నేరుగా తీసుకోకూడదు. తక్కువ నీటిలో కలిపి తీసుకున్న కూడా ఇబ్బంది వస్తుంది. కనుక నిమ్మరసాన్ని తీసుకోవాలనుకునేవారు ఈ అనారోగ్య సమస్యలు కానీ అలర్జీలు కానీ లేకుండా ఉండాలి.

## పరిమితంగా తీసుకుంటే సేఫ్....

అయితే అతిగా నిమ్మరసాన్ని తీసుకోవడం కూడా ఏ మాత్రం మంచిది కాదు. ఏదైనా పరిమితంగా క్రమబద్ధంగా తీసుకున్నప్పుడే దాని నుండి మంచి ఫలితం వస్తుంది. కాబట్టి పైన పేర్కొన్న అనారోగ్య సమస్యలు ఉన్నవారు పొరపాటున కూడా నిమ్మరసాన్ని అతిగా తీసుకోకండి.

# దానిమ్మ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు



పోషకాలు పుష్కలంగా ఉండే దానిమ్మ పండ్లను తినడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్‌సి, ఫోలేట్, పొటాషియం అందుతాయి. దానిమ్మలో చర్మాన్ని అందంగా మార్చే గుణాలు కూడా ఉన్నాయి. అయితే.. సాధారణంగా తినడంతో పోలిస్తే.. ఖాళీ కడుపుతో తింటే బోలెడన్ని ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు పేర్కొంటున్నారు

దానిమ్మ పండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అందుకే.. దానిమ్మ పండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దానిమ్మలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి.. దానిమ్మపండులోని పాలీఫెనాల్స్ మీ గుండెను, రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు.. వ్యాధుల నుంచి రక్షిస్తాయి. అందుకే.. దానిమ్మపండును పోషకాల పండుగా పేర్కొంటారు. రోజూ ఒక దానిమ్మపండును తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి..


- రోజూ ఒక దానిమ్మ పండును ఖాళీ కడుపుతో తింటే శరీరంలో బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది.
- దానిమ్మను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఒత్తిడి, వాపు తగ్గుతుంది.
- దానిమ్మ గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహంలో సహాయపడుతుంది.
- దానిమ్మలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి హృద్రోగులకు మేలు చేస్తాయి..
- శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యం చేస్తుంది.
- రోజూ ఒక దానిమ్మపండు తింటే గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది గుండెపోటు ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.
- దానిమ్మ బీపీ సమస్యను కూడా నియంత్రిస్తుంది.



అనస్వర రాజన్‌కు పుట్టినరోజు కానుక..

## ‘కాకా’లో అమ్ముల‌ుగా ఫస్ట్ లుక్

మలయాళ నటి అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా ‘కాకా’ చిత్ర బృందం ప్రత్యేక కానుకను అందించింది. సినిమాలో ఆమె పోషిస్తున్న ‘అమ్ములు’ పాత్రకు సంబంధించిన తొలి రూపాన్ని విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో అనస్వర రాజన్ వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థినిగా ఎంతో సహజమైన, ఇంటి అమ్మాయి తరహా రూపంలో కనిపిస్తోంది. ఈ లుక్ ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో విశేషంగా ఆకట్టుకుంటోంది. ‘కాకా’లో అనస్వర రాజన్ పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఆమె మెగాస్టార్ చిరంజీవికి కూతురిగా కనిపించనుంది. తండ్రీకూతుళ్ల మధ్య ఉన్న అనుబంధం కథలో కీలకంగా ఉండటమే కాకుండా, చిత్రానికి ప్రధాన భావోద్వేగ అంశంగా నిలవనుందని తెలుస్తోంది. అమ్ములు జీవితంలో తండ్రి పాత్ర ఎంత ముఖ్యమైనదో తెలియజేసేలా తొలి పోస్టర్‌ను కూడా ఆసక్తికరంగా రూపొందించారు. పోస్టర్‌లో చిరంజీవి ముఖాన్ని చూపించకుండా ఆయన నీడను మాత్రమే ఆవిష్కరించారు. దీంతో అమ్ములు పాత్రకు, ఆమె తండ్రికి మధ్య ఉన్న అనుబంధంపై మరింత ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలతో పోలిస్తే ఈ పోస్టర్ కథలోని కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉండబోతుందనే సంకేతాన్ని ఇస్తోంది. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రాన్ని కెవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. చిరంజీవి, అనస్వర రాజన్ కలయికలో తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని తెరపై ఎలా ఆవిష్కరించబోతున్నారనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. ‘కాకా’ చిత్రాన్ని 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. చిరంజీవి, బాబీ కొల్లి కలయికపై భారీ అంచనాలు ఉండటంతో పాటు, ఇప్పుడు అనస్వర రాజన్ పాత్ర కూడా సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రం కోసం మెగా అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





## ‘ది పారడైజ్’పై క్లారిటీ.. వాయిదా లేదు

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం ‘ది పారడైజ్’. ‘దసరా’ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోగా.. ‘యేషనాగుల’, ‘ఆయా షేర్’ వంటి పాటలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయ్యాయి. ఇక అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సినిమా వాయిదా పడుతుందంటూ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పలు వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం మరోసారి విడుదల తేదీపై స్పష్టత ఇచ్చింది. ‘డౌటే వద్దు.. వాయిదా లేదు.. సెప్టెంబర్ 24న వస్తున్నాం’ అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి పుకార్లకు చెక్ పెట్టింది. దీంతో సినిమా వాయిదాపై వస్తున్న వార్తలకు తెరపడినట్లైంది. ఈ ప్రకటనతో నాని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ చిత్రంలో కయాదు లోహార్ కథానాయికగా నటిస్తుండగా, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కుల్కర్ణి, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## డూప్ లేకుండా భారీ స్టంట్ చేసిన మాళవిక మోహనన్

కార్తి హీరోగా పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘సర్దార్ 2’లో మాళవిక మోహనన్ సాహసోపేతమైన యాక్షన్ సన్నివేశాలతో ఆకట్టుకుంటోంది. షూటింగ్ తొలిరోజే రోప్‌ల సాయంతో భారీ ఎత్తు నుంచి స్విమ్మింగ్ పూల్‌లోకి దూకే సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేసింది. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్‌లో శిక్షణతో పాటు ‘తంగలాన్’ కోసం సిలంబం నేర్చుకోవడం తనకు ఈ సన్నివేశంలో ఉపయోగపడిందని తెలిపింది. యాక్షన్ సన్నివేశాల్లో నటన సహజంగా ఉండేలా సీనియర్ నటుడు విక్రమ్ ఇచ్చిన సలహా తనకు ఎంతో ఉపయోగపడిందని మాళవిక చెప్పింది. అలాగే సినిమాలో విలన్‌గా నటిస్తున్న ఎస్.జె. సూర్య నటన తనను ఎంతగానో స్ఫూర్తి చేసిందని, అవకాశం వస్తే భవిష్యత్తులో శక్తివంతమైన ప్రతినాయకురాలి పాత్రలు చేయడానికి సిద్ధమని వెల్లడించింది. కార్తి చాలా సరదాగా, మంచి మనసుతో ఉంటారని ప్రశంసించిన మాళవిక.. ‘సర్దార్ 2’లో అద్భుతమైన దృశ్యాలు, భారీ యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను అలరిస్తాయని చెప్పింది. బ్యాంకాక్‌లోనూ కీలక పోరాట సన్నివేశాలను చిత్రీకరించిన ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఫౌజీ షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్..

సినిమా డెస్క్: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నాడు. ఈ క్రమంలోనే హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామా ‘ఫౌజీ’ షూటింగ్‌కు తాత్కాలికంగా విరామం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్‌కు సంబంధించిన సుమారు 20 రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. ప్రభాస్ ప్రస్తుతం ‘స్పిరిట్’, ‘సలార్ 2’తో పాటు ‘ఫౌజీ’ షూటింగ్‌లలో పాల్గొంటున్నాడు. వరుస చిత్రీకరణల కారణంగా ‘ఫౌజీ’కి సెప్టెంబర్ 15 వరకు విరామం ఇచ్చినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ తర్వాత మిగిలిన షూటింగ్‌ను పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే చిత్రీకరణకు విరామం ఉన్నప్పటికీ నిర్మాణానంతర పనులు మాత్రం వేగంగా సాగుతున్నాయి. ముఖ్యంగా భారీ యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన దృశ్య ప్రభావాల పనులను అమెరికాకు చెందిన ప్రముఖ సంస్థలు చేపట్టినట్లు సమాచారం. సినిమాను భారీ స్థాయి దృశ్య వైభవంతో తెరకెక్కించేందుకు చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇప్పటికే ‘ఫౌజీ’ షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ప్రభాస్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పీరియాడిక్ నేపథ్యానికి యాక్షన్ అంశాలను జోడిస్తూ హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రభాస్‌ను సరికొత్త కోణంలో చూపించనుందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు





## చీరకట్టులో మెరిసిన వైష్ణవి చైతన్య.. ఆకట్టుకుంటున్న లుక్

సినిమా డెస్క్: ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన ‘ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్’ సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఇప్పటికే మంచి ప్రచారం లభిస్తోంది.

తాజాగా జరిగిన సినిమా ముందస్తు విడుదల వేడుకలో వైష్ణవి చైతన్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ చీరకట్టులో వేడుకకు హాజరైన ఆమె అందంగా ముస్తాబై సందడి చేసింది. చీరలో వైష్ణవి చైతన్య లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు మంచి స్పందన రావడంతో ‘ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్’పై ఆసక్తి పెరిగింది. ‘బేబీ’ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి జంటగా నటించడంతో ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S